


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 30-05-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 225 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# నేడు ప్రమాణ స్వీకారం

## సుపరిపాలన అందిస్తా

**వేదిక:** ఇందిరాగాంధీ స్టేడియం

**గ్రౌండ్ కెపాసిటీ:** మొత్తం 30 వేల మంది

**పాసుల జారీ:** సుమారు 12 వేలు

**తిలకించేందుకు:** ఎల్ఇడి స్క్రీన్లు

**పర్యవేక్షణ:** జిల్లా కలెక్టర్ ఇంతియాజ్

**బందోబస్తు:** సీపీ ద్వారకా తిరుమలరావు



విజయవాడ: నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే జగన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ ద్వరకా తిరుమలరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. స్టేడియం లోపల భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, తరువాయి 2లో..



### గుడి.. మసీదు.. చర్చి.. సర్వమత ప్రార్థన

తిరుమల: ఆంధ్రప్రదేశ్ నిశ్చయ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, నుదుటిన తిరునామంతో.. శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. ధ్వజస్తంభానికి నమస్కరించి... వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా గర్భగుడిలోకి వెళ్లి.. తిరుమల వెంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. వైఎస్ జగన్‌కు టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి అన్నివిధాలా మేలు చేయాలని.. ప్రజారంజక, సుపరిపాలన తరువాయి 2లో..

## భరతమాత రుణం తీర్చుకుంటా

- రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌చే మోదీ ప్రమాణం
- హాజరు కానున్న బిమ్‌స్టెక్ నేతలు..
- రికార్డు స్థాయిలో అతిథులు..



దిల్లీ: నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం గురువారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. విదేశాల అధినేతలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, భాజపా అగ్రనేతలు ఇలా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. వీరితో పాటు పశ్చిమబెంగాల్ ఎన్నికల ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన భాజపా కార్యకర్తల కుటుంబ సభ్యులు కూడా మోదీ ప్రమాణస్వీకారానికి రానున్నారట. వీరిని ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచినట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి.

మంగళవారం రాత్రి మెదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షా మధ్య జరిగిన సుదీర్ఘ భేటీలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానితుల జాబితా ఖరారవగా.. దాన్ని రాష్ట్రపతి భవన్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నాయి. ఎన్నికల ఘర్షణల్లో మృతిచెందిన దాదాపు 50 మందికి పైగా భాజపా కార్యకర్తల కుటుంబ సభ్యులు మోదీ ప్రమాణ తరువాయి 2లో..



### ఐదోసారి సీఎంగా నవీన్ పట్నాయక్

**భువనేశ్వర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉత్సవం**

**వరుసగా ఐదోసారి ప్రమాణస్వీకారం .. 21 మంది మంత్రులుగా ప్రమాణం**

భువనేశ్వర్: ఒడిశాలో బీజేడీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బిజు జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ వరుసగా ఐదోసారి ప్రమాణస్వీకారం చేశారు. భువనేశ్వర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర తరువాయి 2లో..

### సాగర తీరంలో మరో మ్యూజియం

విశాఖపట్నం: సాగర తీరంలో మరో మ్యూజియంను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో సి హరియర్ ఎయిర్ క్రాఫ్ట్ విశాఖకి చేరుకుంది. మరో 6 నెలల్లో సి హరియర్ మ్యూజియం అందుబాటులోకి రానుంది. ఈ యుద్ధ విమానం భారత నౌకాదళంలో ఏవియేషన్ విభాగంలో దేశానికి 32 సంవత్సరాల పాటు సేవలను అందించింది. 2016లో సేవల నుంచి సి హరియర్ ఎయిర్ క్రాఫ్ట్ నిష్క్రమించింది.




### లోక్‌సభ టీడీపీ పక్ష నేతగా రామ్మోహన్‌నాయుడు



విజయవాడ: టీడీపీ అధినేత చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశమైంది. ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. లోక్‌సభ టీడీపీ పక్ష నేతగా రామ్మోహన్‌నాయుడును ఎన్నుకున్నారు. రాజ్యసభలో టీడీపీ పక్ష నేతగా సుజనాచౌదరి ఎంపిక చేశారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేతగా గల్లా జయదేవ్ వ్యవహరిస్తారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

శ్రీకాకుళం లోక్‌సభ ఎంపీగా రామ్మోహన్‌నాయుడు వరుసగా రెండోసారి విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌పై 6,653ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందారు. రామ్మోహన్‌కు అనుకూలంగా క్రాస్‌ఓటింగ్ జరిగింది. ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 4,98,206 ఓట్లు పోలయ్యాయి. రామ్మోహన్‌నాయుడికి మాత్రం 5,34,544ఓట్లు పోలయ్యాయి. అంటే క్రాస్‌ఓటింగ్ ద్వారా అదనంగా ఆయనకు 36,338 ఓట్లు లభించాయి. గుంటూరు లోక్‌సభ సభ్యుడిగా టీడీపీ నేత గల్లా జయదేవ్ వరుసగా రెండోసారి కూడా విజయం సాధించారు. ఈ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు చోట్ల వైసీపీ గెలిచినా.. క్రాస్ ఓటింగ్ కారణంగా జయదేవ్ 4,216 ఓట్ల ఆధిక్యంతో వైసీపీ అభ్యర్థి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిపై గెలిచారు.

### మహానేతకు జగన్ ఘన నివాళి



ఇడుపులపాయ: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించి ఆశీర్వాదం పొందారు. ఇడుపులపాయలోని వైఎస్‌ఆర్ సమాధిపై పూలమాల వేసి ఆయన కొద్దిసేపు మౌనంగా ప్రార్థనలు చేశారు.

జగన్‌తో పాటు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పలువురు పార్టీ నేతలు ఉన్నారు. అంతకు ముందు ఇడుపులపాయ చేరుకున్న జననేతకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌ను కలుసుకునేందుకు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. వారందరికీ అభివాదం చేస్తూ ఆయన ముందుకు కదిలారు.

## రాష్ట్రాభివృద్ధికోసం చిత్తశుద్ధితో పనిచేశాం

- మనం ఓటమి చెందలేదు
- సానుభూతే వైకాపాను గెలిపించింది
- కొత్త ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూడాలి
- నూతన ఎమ్మెల్యేలకు బాబు దిశానిర్దేశం



అమరావతి: తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన చంద్రబాబు నాయుడు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు సభలో అనుసరించాల్సిన వ్యూహం, భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల కోపం వల్ల మనం ఓటమి చెంద లేదు. జగన్ పట్ల ఉన్న సానుభూతే ఆ పార్టీని గెలిపించింది. రాష్ట్రాభివృద్ధి కోసం ఐదేళ్లు చిత్తశుద్ధితో పని చేశాం. కాలంతో పరిగెత్తాం, అనేక పనులు చేశాం. సమర్థ నీటినిర్వహణతో నీటి కొరతను అధిగమించాం.

రాజధాని నిర్మాణ పనులు వేగంగా చేపట్టాం. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకున్నా చాలా చేశాం. కానీ, ప్రజల అంచనాలు వేరుగా ఉన్నాయి. అయినా 39.2శాతం ఓట్లు రాబట్టాం. ఏదేమైనా కొంతకాలం వేచి చూద్దాం. కొత్త ప్రభుత్వం ఏంచేస్తుందో చూద్దాం. అన్నింటినీ నిశితంగా గమనిద్దాం, ఆతర్వాతే స్పందిద్దాం. ఎన్నికైన ఎమ్మెల్యేల్లో ముగ్గురు మినహా అందరూ గతంలో పనిచేసినవారే. పాత, కొత్త కలబోతతో తెలుగుదేశం వాణిని బలంగా వినిపించాలి. ఆయా నియోజకవర్గాల సమస్యలను సభలో ప్రస్తావించాలి. సకాలంలో తరువాయి 2లో..



# సింహగిరిపై ఘనంగా హనుమజ్జయంతి





సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి వారి అనుబంధ ఆలయం మెట్లమార్గంలో గల శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవములు బుధవారం నాడు ఘనంగా జరిపారు. వైశాఖబహుళ అష్టమి మొదలుకొని బహుళ దశమివరకు మూడు రోజుల పాటు విశేష ఉత్సములు స్వామికి జరుపగా జయంతినాడు పంచామృత అభిషేకములు, విశేష అర్చనలు, శ్రీరామ పట్టాభిషేక సర్గపారాయణం, పుర్ణాహుతి విశేషంగా జరపగా అనంతరం భక్తులు భజనలు చేశారు అనంతరం స్వామి వారి ప్రసాద వితరణజరుగగా ఈ ఉత్సవంలో దేవస్థానం అధికారులు సింహాచలం చుట్టుప్రక్కల గ్రామప్రజలు భారీ ఎత్తున పాల్గొని స్వామివారికి ఫలపుష్పాలు సమర్పించారు.

# వైభవంగా శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

గాజువాక: పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల శ్రీహనుమాన్ జయంతోత్సవాలను వైభవంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గాజువాక, ఉక్కునరగరం, పెద గంట్యాడ, పాతగాజువాక, అక్కిరెడ్డిపాలెం, కూర్మన్నపాలెం, అగనంపూడి, సింథియా, శ్రీహరి పురం, మల్కాపురం, ప్రకాష్‌నగర్ ఎక్స్‌సర్వీ స్‌మెన్ కాలనీ తదితర ప్రాంతాలలో ఉన్న హను మాన్ ఆలయాలలో బుధవారం ఆలయ అర్చకుల సమక్షంలో స్వామివారికి సింధూర పూజలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సంధర్భంగా భక్తులు మాట్లాడుతూ శ్రీరామునికి ఆంజినేయస్వామి పరమభక్తుడని, ఆంజనేయస్వామిని పూజిస్తే సకల పాపాలు పోతాయని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాల ఔన్నత్యాన్ని బావితరాలకు తెలియజేయవలసి ఉందని అన్నారు. ప్రతీ ఒక్కరూ దైవచింతన కల్గివుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**గాజువాక మెహర్‌నగర్‌లో** : రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి రావాలని, జగన్ ముఖ్య మంత్రి కావాలని గాజువాకలో తిప్పలనాగిరెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని ఆంజినేయ స్వామివారికి ప్రత్యేకపూజలతోపాటు, 1101 కొబ్బరికాయలను సమర్పించారు.

గాజువాక మెహర్‌నగర్ ప్రాంతంలో వైకాపా నాయకులు బొచ్చల త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు దొడ్డి రమణ మంత్రి మంజుల ఎ.వెంకటే శ్వరరావు, శ్రీనివాసు, రాంబాబు, డా.మోహన్, నెల్లిరమణలు పాల్గొని మాట్లాడుతూ తమ నాయకుడు తిప్పలనాగిరెడ్డి గాజువాక ఎమ్మెల్యే గెలవాలని, రాష్ట్ర ముఖ్య మంత్రిగా వైయస్ జగన్ కావాలని స్వామివారికి మొక్కుకున్నామని తమకోర్కెలు తీరిన సంధర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించామని తెలిపారు.

# ఆంజనేయుని పూజిస్తే సకల దోషాలు నివారణవుతాయి

## వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు



సబ్బవరం: వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు జరి గాయి. మండలంలోని గ్రామాల్లో రావలమ్మపాలెం, తవ్వ వానిపాలెం, ఆరిపాక, సాయినగర్‌లలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుండే పూజలు జరిగాయి. భక్తులు క్యూలో నిల్చుని ఒకరి తరువాత ఒకరు పూజలు జరిపి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గుడి వద్ద తీర్థ ప్రసాదములు పంచి పెట్టారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత భారీ అన్న సమా రాధన జరిగింది. అలాగే తవ్వ వానిపాలెం, రావలమ్మ పాలెంలలో కూడా భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

# రాష్ట్ర డిజిపి అభినందనలు అందుకున్న పోలీసు కార్యాలయ ఉద్యోగి



విజయనగరం: జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ సహాయకులుగా పని చేస్తున్న ఉద్యోగి టి. సునీల్ కుమార్‌ను రాష్ట్ర డిజిపి ఆర్.పి. ఠాకూర్ డిజిపి కార్యాలయంలో విధులను సమర్ధవంతంగా నిర్వహించినందుకుగాను అభినందించి, ప్రశంసా పత్రాన్ని అందజేసారు. ఎన్నికల విధులను డిజిపి కార్యాలయంలో నిర్వహించేందుకుగాను జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న జూనియర్ సహాయకులు టి.సునీల్ కుమార్ ప్రత్యేకంగా నియమించబడ్డారు. ఎన్నికల విధులను ఫిబ్రవరి 4 నుండి ఏప్రిల్ 13 వరకు మంగళగిరిలోగల డిజిపి కార్యాలయంలోనే విధులనునిర్వహించారు. ఎన్నికల విధులను నిర్వహించే సమయంలో సమర్ధవంతంగా పనిచేయండలోను, ఇతర జిల్లాలనుండి సమాచారంను రాబట్టి, ఎన్నికల కమీషనుకు సమాచారాన్ని పంపడంలోను, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడంలోటి. సునీల్ కుమార్ సమర్ధవంతంగా పనిచేసారు. టి. సునీల్ కుమార్ ప్రతిభను గుర్తించిన రాష్ట్ర డిజిపి ఆర్.పి. ఠాకూర్ అభినందిస్తూ, ప్రశంసా పత్రాన్ని అందజేసారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావులు పోలీసు కార్యాలయ జూనియర్ సహాయకులు టి. సునీల్ కుమార్‌ను అభినందించి, ప్రశంసా పత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆఫీసుసూపరింటెండెంట్ చంద్రశేఖర్ మరియు ఎస్పీ సిసి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# రామనారాయణంలో వైభవంగా హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలు



విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన,అష్ట కలశారాధన, అష్ట కలశ స్నపనము గావించారు. అనంతరం ప్రాంగణం ప్రధాన అర్చకులు చాణక్య, శ్రీహర్షల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ఆంజనేయ స్వామికి సహస్రనామావళితో సింధూరము, లక్ష తమలపాకులు, తులసి దళాలు, కనకాంబరాలతో ప్రత్యేక పూజలు గావించారు. ఈ వేడుకలలో నారాయణం మురళి, హిమబిందు దంపతులు, సీతాపతిరావు, రమాదేవి దంపతులు, ఆకాశ్, ఎన్‌సిఎస్ షుగర్స్ సీఈవో వేంకటేశ్వరరావు ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరాజు, ఎం వి రమణ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అప్పన్నను దర్శించుకున్న వైసీపీ పలాస ఎమ్మెల్యే అప్పలరాజు



సింహాచలం : శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామివారిని బుధవారం నాడు వైయస్ఆర్ సీపీ పలాస ఎమ్మెల్యే టి.అప్పలరాజు దంపతులు దర్శించుకున్నారు . సింహగిరికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా .బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్ర నామములతో ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ ఏ ఈ ఓ ఆర్ వి ఎస్ ప్రసాద్ వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.

# దంశరాయి గ్రామంలో మెడికల్ క్యాంప్



అనంతగిరి : అనంతగిరి మండలంలోని కొత్తూరు పంచాయతీ దంశరాయి గ్రామంలో బుధవారం మెడికల్ క్యాంపు పెట్టారు. వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి ఉన్నారు. ముగ్గురకు జ్వరములు ఉన్నట్లుగా గుర్తించి రక్త పూతలు సేకరించి మందులు అందించి ఉన్నారు వీటిని క్రమం తప్పకుండా వాడాలని వైద్యాధికారిని అనూష తెలిపారు. వ్యాధులు ముసిరే కాలములో చేపట్టవలసిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. మంచినీరు కాచి వడపోసి రాగాలని ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని నీరు లేకుండా చూసుకోవాలని దోమలు రాకుండా దోమతెరలు వాడాలి అని తెలిపారు.



**విజయనగరం: స్థానిక శంకరమఠంలో హనుమజయంతి సందర్భంగా శ్రీరామసమితి ఆధ్వర్యంలో 30 మంది ఋత్వికులతో సుందరకాండ పారాయణం జరిగింది. బుధవారం శ్రీస్వామివారికి నగదళ సింధూరార్చన ను సేవా సమితి అధ్యక్షులు యు.వి.సోమయాజులు నిర్వహించారు.**

# అభివృద్ధి పనులపై అధికారులతో మంత్రి మల్లాడి

యానాం : యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో జరగవలసిన వివిధ శాఖలుకు సంబంధించిన అభివృద్ధి పనుల పనితీరుపై అధికారులతో పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించి చర్చించారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో పరిపాలనాధికారి శివరాజ్ మీనా సమక్షంలో సుమారు 4 గంటల పాటు చర్చించారు. గత 2నెలలుగా ఎన్నికలు జరిగిన నేపథ్యంలో అభివృద్ధికి మంజూరు అయిన నిధులు, వాటి వినియోగంపై చర్చించి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ శాఖకు గతంలో మంజూరు అయిన నిధులు, అభివృద్ధి పనులకు వినియోగించకపోవడం తదితర అంశాలపై చర్చించారు. తక్షణం ఆ నిధులు అభివృద్ధి పనులకు కేటాయించి పూర్తి చేసేలా చర్చలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.గౌరి సరోజని, ఇఇ.రాందాసు, దారా సుబ్బరాజు, సాయినాధ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నెలవంక నుంచి నేటిదాకా వేలాదిమందికి ఇఫ్తార్ విందు



విజయనగరం: ప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం హజరత్ ఖాదర్ షా ఖాదర్ వలి(ర.అ) మహాత్మ వారు వేంచేసియున్న విజయనగరం బాబామెట్టలో రంజాన్ నెల సందర్భంగా అనేకమందికి ప్రతిరోజు రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. నిత్యం సుమారు 500 మంది ఈ విందులో పాల్గొని అన్నప్రసాద వితరణ పొంది బాబావారి ఆశీసులు తీసుకుంటున్నారు. దీనిని హజరత్ ఖాదర్ వలి బాబా(ర.అ) వారి ప్రియశిష్యులు సూఫీ మహాత్మ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి ఆశీసులతో వారి తనయులు డాక్టర్ ఎం.డి.ఖలీలుల్లా షరీఫ్ నిర్వహణలో జరుగుతున్నాది. బాబావారి భక్తులు ఈ సేవలో పాల్గొంటున్నారు. ప్రతిఏటా ఈ క్రతువు జరుగుతున్నాదని ఇప్పటికి దాదాపుగా రెండుదశాబ్ధాలుగా మేం పాల్గొంటున్నామని కొందరు భక్తులు తెలిపారు. కేవలం ముస్లింలకే కాదు వారి ఉపవాస అనంతరం నిరుపేదలకు అన్నార్తులకు కూడా ఇక్కడ అన్నసమారాధనలో ప్రసాదవితరణ ఉంటుందని వారు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# భరతమాత రుణం తీర్చుకుంటా

స్వీకారానికి రానున్నారు. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆ రాష్ట్ర కార్యకర్తల కుటుంబాలకు భాజపా అధినాయకత్వం అండగా ఉంటుందని చెప్పేందుకే వారిని ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బెంగాల్‌లో గతేడాది జరిగిన పంచాయతీ ఎన్నికల్లో చాలా మంది భాజపా కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ భాజపా, తృణమూల్ వర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు చెలరేగిన విషయం తెలిసిందే.

మోదీ ప్రమాణస్వీకారానికి ఎన్నో ప్రత్యేకతలు

భారీ మెజారిటీతో సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది రెండోసారి ప్రధాని పదవి చేపడుతున్న నరేంద్ర మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమం నేడు దిల్లీలో ఘనంగా జరగనుంది. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంతో పోల్చితే ఈ సారి ప్రమాణస్వీకారానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. తొలిసారిగా పలువురు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

బిమ్‌స్టెక్ నేతలు..

మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకావాల్సిందిగా బిమ్‌స్టెక్ దేశాల అధిపతులకు ఆహ్వానాలు వెళ్లాయి. బిమ్‌స్టెక్ నేతలు ప్రధాని ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరుకానుండటం ఇదే తొలిసారి. బిమ్‌స్టెక్ కూటమిలో బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక, థాయిలాండ్, నేపాల్, భూటాన్‌లు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ దేశాలు కలిసి బంగాళాఖాత బహుళరంగ సాంకేతిక, ఆర్థిక సహకార ప్రారంభం (బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీసెక్టరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్-బిమ్‌స్టెక్)గా ఏర్పాటయ్యాయి. గతసారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సార్క్ దేశాల కూటమిని ఆహ్వానించడం గమనార్హం. సార్క్ కూటమిలో పాకిస్థాన్‌కు సభ్యత్వం ఉండగా, బిమ్‌స్టెక్‌లో లేదు. 2014లో అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ఆహ్వానించగా, ఈసారి ప్రస్తుత ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఆహ్వానం పంపలేదు.

రికార్డు స్థాయిలో అతిథులు..

ఈ సారి ప్రమాణస్వీకారోత్సవానికి అతిథుల సంఖ్య కూడా భారీగానే ఉంది. దాదాపు 6500 మంది అతిథులు హాజరుకానున్నట్లు సమాచారం. 2014లో మోదీ తొలిసారిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు అతిథుల సంఖ్య ఐదు వేల వరకు మాత్రమే ఉంది. గురువారం రాత్రి 7 గంటలకు నరేంద్ర మోదీచేత రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ప్రమాణం చేయించనున్నారు. మోదీ మంత్రివర్గం కూడా ఇదే సమయంలో కొలువుదీరనుంది.

# సుపరిపాలన అందిస్తా

పార్కింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. గ్రౌండ్‌లో 12వేల మంది, గ్యాలరీలో 18వేల మంది కూర్చునేందుకు వీలుందని తెలిపారు. ప్రమాణ స్వీకారానికి 12 వేల పాసులు జారీ చేస్తున్నామని, సాధారణ ప్రజలను గ్యాలరీలోకి అనుమతిస్తామని సీపీ వెల్లడించారు. స్టేడియం సమీపంలో 10వేల మంది వరకు వీక్షించేందుకు అనువుగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. విజయవాడ మీదుగా వెళ్లే వాహనాలను శివారు మీదుగా మళ్లిస్తామని, ట్రాఫిక్ ఆంక్షలు గమనించి సహకరించాలని వివరించారు. నగరంలో స్టేడియం మీదుగా వెళ్లే వాహనాలను ఇతర మార్గాల్లో మళ్లిస్తామని చెప్పారు. పాసులు ఉన్నవారంతా ఉదయం 10.30గంటల లోపు స్టేడియంలోకి చేరుకోవాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 12.23 గంటలకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## గుడి.. మసీదు.. చర్చి.. సర్వమత ప్రార్థన



అందించేలా ఆశీర్వాదం ఇవ్వాలని శ్రీ వేంకటేశ్వరస్వామిని కోరారు. ఆలయంలో శ్రీవారి సేవలో గడిపిన వైఎస్ జగన్‌కు రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించారు. శాలువాతో సత్కరించి.. శ్రీవారి చిత్రపటాన్ని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా ఆయన వెంట విజయసాయిరెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితర నేతలు, పార్టీ ఎమ్మెల్యేలు పలువురు ఉన్నారు. జననేత ఏ కార్యక్రమమైనా చేపట్టేముందు భగవంతుని ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీ. తాను చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రకు ముందు, పాదయాత్ర ముగిసిన తర్వాత కూడా వైఎస్ జగన్ శ్రీవారిని దర్శించుకున్నారు. నేడు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ముందుగా ఆయన శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కడి నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో వైఎస్ఆర్ జిల్లా కడపకు బయలుదేరి వెళ్లారు. కడపలో పెద్ద దర్గాను వైఎస్ జగన్ దర్శించుకున్నారు. అనంతరం పులివెందులకు చేరుకుని అక్కడి సీఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

మంగళవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో వైఎస్ జగన్ రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకొని.. అక్కడి నుంచి తిరుమల కొండ మీదకు వచ్చిన సంగతి తెలిసిందే. రేణిగుంట విమానాశ్రయంలో వైఎస్ జగన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఘనస్వాగతం పలికారు. వారి కోసం కాన్వాయ్‌లోని తన వాహనం నుంచి దిగి మరీ.. వైఎస్ జగన్ అభివాదం చేశారు. ఈ సందర్భంగా తనను చుట్టుముట్టిన పార్టీ శ్రేణులు, అభిమానులతో కాసేపు ముచ్చటించారు. అభిమానులు అందించిన శాలువాలు, పుష్పగుచ్చాలను స్వీకరించారు. అంతకుముందు వైఎస్ జగన్ తాడేపల్లి నుంచి రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 5.20కు గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. రాత్రికి పద్మావతి గెస్ట్‌హౌస్‌లో బస చేసిన వైఎస్ జగన్.. ఉదయం గెస్ట్‌హౌస్ నుంచి ఆలయానికి వెళ్లారు.

**పెద్ద దర్గాను సందర్శించిన వైఎస్ జగన్**

ఆంధ్రప్రదేశ్ కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా కడపలోని పెద్ద దర్గాను సందర్శించారు. పెద్ద దర్గా వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. అమీన్‌పీర్ దర్గాలోకి ప్రవేశించిన వైఎస్ జగన్‌కు దర్గా మతపెద్దలు సాంప్రదాయరీతిలో తలపాగా చుట్టారు. దర్గాలో వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి.. చాదర్ సమర్పించారు. అనంతరం ఆయన పులివెందుల వెళ్లి అక్కడి సీఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రేణిగుంట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన కడప వచ్చిన సంగతి తెలిసిందే. కడప విమానాశ్రయంలో వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి.. జిల్లా కలెక్టర్ హరికిరణ్, ఎస్పీ అభిషేక్ మహంతి, జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శాసనసభ్యులు, ఎంపీలు, శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

# గవర్నర్ నరసింహన్‌తో జగన్ భేటీ

గవర్నర్ నరసింహన్‌తో వైకాపా అధినేత, ఏపీకి కాబోయే సీఎం వైఎస్ జగన్ భేటీ అయ్యారు. గురువారం ప్రమాణస్వీకార కార్యక్రమం నేపథ్యంలో ఇప్పటికే విజయవాడ చేరుకున్న గవర్నర్‌ను గేట్‌వే హోటల్లో జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఆయన నేరుగా గేట్‌వే హోటల్‌కు వెళ్లి గవర్నర్‌తో సమావేశమయ్యారు. రేపటి ప్రమాణస్వీకార ఏర్పాట్లపై వీరిద్దరూ మాట్లాడుకున్నట్లు తెలిసింది. గురువారం మధ్యాహ్నం 12.23 గంటలకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి.

# ఐదోసారి సీఎంగా నవీన్ పట్నాయక్

గవర్నర్ గణేశీ లాల్ ఆయన చేత ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు మరో 21 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారానికి ముందు నవీన్ పట్నాయక్ శ్రీమందిర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేశమంతా మోదీ పవనాలు వీస్తున్నా ఒడిశాలో మాత్రం నవీన్ పట్నాయక్ ఏకఛత్రాధిపత్యం వహిస్తున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని అనిపిస్తుంది. ఇటీవల జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో బిజు జనతాదళ్ అఖండ విజయం సాధించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 147 స్థానాలకు గానూ 112 చోట్ల బీజేడీ విజయం సాధించింది. దీంతో వరుసగా ఐదోసారి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఏర్పడింది. నవీన్ పట్నాయక్ హింజిలి, బిజాపూర్ స్థానాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేడీ జయకేతనం ఎగురవేసింది. ఒడిశాలో 21 లోక్‌సభ నియోజకవర్గాలకు గానూ 12 చోట్ల విజయం సాధించింది.

కాగా.. వరుసగా ఐదోసారి నవీన్ పట్నాయకే సీఎం అవడం విశేషం. జ్యోతిబసు, పవన్ కుమార్ చామ్లింగ్ మాత్రమే దేశంలో ఇప్పటివరకు వరుసగా ఐదు సార్లు సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. వారి సరసన నవీన్ చేరి అరుదైన గుర్తింపు సాధించారు.

# రాష్ట్రాభివృద్ధికోసం చిత్తశుద్ధితో పనిచేశాం

పరిష్కారమయ్యేలా శ్రద్ధ వహించాలి అని చంద్రబాబు సూచించారు. టీడీఎల్పీ సమావేశం ముగిసిన తర్వాత ఎమ్మెల్యే చినరాజప్ప మీడియాతో మాట్లాడుతూ... ఉప నేతలు, విప్ పదవులు ఎవరికివ్వాలనే నిర్ణయాన్ని చంద్రబాబుకే అప్పగించామన్నారు. తక్కువ మంది సభ్యులున్నా.. తాము ప్రజల తరఫున పోరాడతామన్నారు. ఎన్నికల్లో ఓటమిపై విశ్లేషణ చేసుకుంటామని చినరాజప్ప తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## జన్యుసవరణపై తీవ్ర స్పందన

చైనాలోని ఒక శాస్త్రవేత్త ఇద్దరు గర్భస్థ శిశువులకు జన్యు సవరణ జరిపినట్టు వెలువడిన వార్త ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. హెచ్‌ఐవీ సోకకుండా నిరోధించడానికి వీలుగా జన్యు సవరణ జరిపినట్టు ఆయన వెల్లడించారు. హె జియాంకుయి అనే ఈ శాస్త్రవేత్త ఎంతో కాలంగా జన్యు సవరణపై పరిశోధనలు జరుపుతున్న మాట నిజమే అయినప్పటికీ, ఇద్దరు శిశువులపై ఈ ప్రక్రియను ప్రయోగించి చూశారా అనే సందేహం ఇంకా నివృత్తి కాలేదు. అయినప్పటికీ ఈ జన్యుసవరణ మానవులపై చూపే ప్రభావాలు, దుష్ప్రభావాల తీవ్ర మూలంగా ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తల నుంచి తీవ్ర స్పందన వచ్చింది. చైనా ప్రభుత్వం కూడా వెంటనే ఈ పరిశోధనలను నిలిపివేస్తామని ప్రకటించింది. అంతర్జాతీయ ఒత్తిడి మూలంగా శాస్త్రవేత్త జియాంకుయి కూడా మనుషులపై జన్యు సవరణను నిలిపివేస్తున్నట్టు ప్రకటించక తప్పలేదు. ఇటీవలికాలంలో కృత్రిమ మేధ, యంత్ర మానవులు, జన్యు మార్పిడి వంటి అనేక రంగాలలో పరిశోధనలు సాగుతున్నాయి. ఈ పరిశోధనలు మానవాళి జీవన విధానాలను భారీగా మార్చే అవకాశాలు ఉన్నాయి. ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవాళి సంక్షేమానికే కాకుండా, వినాశనానికి కూడా ఉపయోగించు కోవచ్చుననేదే ఆందోళనకు కారణం. తాజా జన్యు సవరణను క్రిస్పర్ కాస్9 అనే ప్రక్రియ ద్వారా జరిపినట్టు చైనా శాస్త్రవేత్త చెప్పుకుంటున్నారు. క్రిస్పర్ అనేది జీవ విధానం ద్వారానే డీఎన్ఏను మార్చే ప్రక్రియ. వైరస్ సోకినప్పుడు బ్యాక్టీరియా ఏ విధంగా కాపాడుకుంటుందనే విషయమై పరిశోధన చేస్తున్న జెనిఫర్ డైడ్‌నా అనే శాస్త్రవేత్త 2012లో దీనిని కనుగొన్నారు. దాడికి గురైన బ్యాక్టీరియా ఒక రకమైన జన్యుపదార్థాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఈ పదార్థం కాస్9 అనే ప్రొటీన్‌తో కలిసి వైరస్‌ను డీఎన్ఏను విడగొట్టి నిశ్చేతనం చేస్తుంది. ఈ కొత్త విధానాన్ని కనుక్కోవడంతో జన్యు పరిశోధనలో విప్లవాత్మక మార్పు చోటుచేసుకున్నది. శాస్త్రవేత్తలు ఇదే ప్రక్రియను ఉపయోగించి జన్యువును సవరించడం, తొలిగించడం, కొత్తది ప్రవేశపెట్టడం వంటివి చేస్తున్నారు. కోట్లాది రసాయన మిశ్రమాలతో కూడుకున్న జన్యు సంకేతాలను సులువుగా పరిశీలించి, సూక్ష్మమార్పులు చేయడం సాధారణమైపోయింది. గతంలోనూ ఒకటి రెండు జన్యుసవరణ ప్రక్రియలను శాస్త్రవేత్తలు ఉపయోగిస్తున్నారు. లండన్‌లో ఒక ప్రక్రియ ద్వారా క్యాన్సర్‌ను అరికట్టడం సాధ్యమైంది. ఎయిడ్స్‌కు చికిత్స చేయడంలో కూడా కొంత ముందడుగు పడ్డది. ఇతర వ్యాధుల విషయంలోనూ పరిశోధన సాగుతున్నది. అయితే ఈ క్రిస్పర్ అత్యంత సులభమైన, చౌకైన ప్రక్రియ. దీంతో వృక్ష జంతుజాలంతో సహా అన్ని రకాల పరిశోధనలకు ఈ ప్రక్రి య ఊతం ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా జీవసాంకేతిక పరిశోధనశాలలు ఈ ప్రయోగాలు సాగిస్తున్నాయి. మానవులకు సంబంధించి అయితే, వంశపారం పర్యంగా వచ్చే జన్యుపరమైన వ్యాధులకు చికిత్స దీని ద్వారా లభిస్తుందనే అభిప్రాయం ఉన్నది. క్యాన్సర్ వంటి వ్యాధులకు కూడా చికిత్స సాధ్యమనే భావిస్తున్నారు. భవిష్యత్తులో జన్యు చికిత్స ప్రాముఖ్యం పెరుగుతుంది కనుక, క్రిస్పర్ ప్రక్రియ పేటెంట్‌పై ఇప్పటికే న్యాయపోరాటం మొదలైంది. ఈ పోరాటంతో సంబంధం లేకుండానే ప్రపంచవ్యాప్తంగా ప్రయోగాలు కూడా సాగుతున్నాయి. జన్యు చికిత్స విజయవంతమై, పేటెంట్ పొందితే కనకవర్షం కురిసినట్టేననే ఆశ కంపెనీలకు ఉన్నది. జన్యు మార్పిడి పరిశోధనలు ఇప్పటికే మొక్కలలో, జంతువులలో సాగుతున్నది. సంతాన సాఫల్యం కోసం వచ్చే జంటల ద్వారా లభించిన పిండాలపై కూడా పరిశోధనలు సాగుతున్నాయి. అయితే ఏ పిండాలనైతే గర్భధారణకు ఉపయోగించకుండా పడేస్తారో వాటిపైనే ప్రయోగాలు సాగుతున్నాయి. కానీ బతికేవారిపై మాత్రం జరుపడం లేదు. భయాందోళనలు, నమ్మకాల కారణంగా శాస్త్ర పురోభివృద్ధిని అడ్డుకోవడం తగదు. అయితే ఈ ప్రయోగాలకు సంబంధించిన భయాందోళనలను కొట్టివేయలేము. తాజా జన్యుసవరణపై దాదాపు నూటా ఇరవై మంది శాస్త్రవేత్తలు కలిసికట్టుగా ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. శాస్త్రవిజ్ఞానం వ్యాపార సంస్థల చేతిలో చిక్కి వెర్రితలలు వేస్తుందనేదే శాస్త్రవేత్తల ఆందోళనకు కారణం. ప్రపంచంలో ఆకలిని తీర్చడానికి మొక్కలపై జన్యు పరిశోధనలను సమర్థించుకుంటున్నారు. కానీ ఆహార సమస్యను సరైన సామాజిక, పరిపాలనా విధానాల ద్వారా పరిష్కరించగలమే తప్ప, శాస్త్ర పరిశోధనల ద్వారా కాదు. వరిలో పంది జన్యువును చేర్చడం వంటి విక ృత పోకడలు పెరిగిపోతున్నాయి. కీటకాలను తట్టుకునే శక్తి జన్యుమార్పిడి విత్తనాలకు ఉంటుందనే ప్రచారం సాగుతున్నది.

## ఈ ఏడాది రవాణాశాఖకు 4వేల కోట్ల ఆదాయం లక్ష్యం



విజయనగరం: రాష్ట్రంలో ఈ ఏడాది(2019-20 రవాణా శాఖ ఆదాయానికి 4వేల కోట్ల రూపాయలకు పెంచాలని లక్ష్యంగా నిర్ధేశించినట్లు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి డాక్టర్ భువనగిరి శ్రీకృష్ణవేణి తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో విజయభానుతో మాట్లాడుతూ దానినిబట్టి గ్రోత్‌రేట్ 24.05 శాతం ఉంటుందని గత ఏడాది 3వేల687.50 కోట్లు నిర్ధేశించిగా దానిని చేరుకోవడం జరిగిందని అన్నారు. లైఫ్‌టాక్స్ 28.5శాతం, క్వాలిటీ టాక్స్ 23.4. శాతం, పీజుల రూపంలో 20 శాతం, యూజర్లు ఛార్జిలు 20శాతం,డిటెక్షన్ 12 శాతం నిర్ధేశించారని తెలిపారు. ఈ ఏడాది ప్రతిపాదనలు 12 శాతం వరకు పెంచారని తెలిపారు. జిల్లా అధికారుల వ్యకక్తిగత లక్ష్యాలను బట్టి చూస్తే 5నుంచి 8లక్షల దాకా పెంచుతూ నిర్ధేశించినట్లు తెలియజేశారు. ఇక జిల్లా విషయానికి వస్తే గత ఏడాది ఇచ్చిన లక్ష్యాలను దాదా పుగా అధిగమించా మన్నారు. 18.34 శాతం లక్ష్యం ఇవ్వగా 22.64 సాధిం చామని, ఇది క్వాలిటీ టాక్స్‌లో వచ్చిందన్నారు. లైఫ్ టాక్స్ విషయంలో 44.60 శాతం ఇవ్వగా 57.31 శాతం 17.22. శాతానికి 20.66 శాతం వచ్చిందని అన్నారు. అయితే సిబ్బంది అంకిత భావం, వారి లక్ష్యాల పట్ల నిబద్ధత వల్ల అనుకున్నది సాధించామని తెలిపారు.

## నేరాల నియంత్రణకు ప్రత్యేక పెట్రోలింగ్ వాహనాలు : జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్



విజయనగరం: పట్టణంలో నేరాల నియంత్రణ, ఆక తాయిల ఆగడాలను నియంత్రించేందుకు ప్రత్యేక పెట్రోలింగు వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ బుధవారం తెలిపారు. విజిబుల్ పోలీసింగులో భాగంగా పగటిపూట, రాత్రి సమయాల్లో గస్తీ తిరిగే పోలీసులకు ప్రత్యేకంగా రూపొందించిన నీలి మరియు నారింజ రంగుల్లో జాకెట్లు ధరించిన గస్తీ బృందాలను జిల్లా ఎస్పీఎ.ఆర్. దామోదర్ ఎస్పీ కార్యా లయం వద్ద లాంఛనంగా, జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీఎ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ - పగటిపూట జరిగే జేబు దొంగతనాలు, షాపింగు మాల్స్, రైల్వే స్టేషన్లు, బస్టాప్‌లు, బస్టాండుల వద్ద అనుమానస్పద వ్యక్తుల సంచారం, దొంగతనాలు, ఈవ్ టీజింగులు, కన్నపు నేరాలను నియంత్రించేందుకు నేరస్థుల గురించి అవగాహన కలిగిన 40మంది పోలీసు కానిస్టేబుళ్ళను ఎంపిక చేసి, ఈప్రత్యేక విధులకు వినియోగిస్తా మన్నారు. ఈ బృందాలు మోటార్ సైకిళ్ళుతోను, ప్రత్యేక వాహనాలతోపాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ కూడా తనిఖీలు చేపడతారన్నారు. పట్టణాల్లో మోటారు సైకిళ్ళుపై గస్తీ తిరిగే బృందాలు నీలం రంగు జాకెట్లును, జీపులపై పెట్రోలింగు నిర్వహించే బృందాలు నారింజ రంగు జాకెట్లును ధరిస్తారన్నారు. ఈబృందాలు ధరించే ప్రత్యేక జాకెట్లు వలన ప్రజలు సులువుగా గుర్తించి, వారికి సమాచారం అందించే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ బృందాలు ఉదయం 8గం॥లు నుండి రాత్రి9 గం॥ల వరకు విధులు పట్టణాల్లో విధులు నిర్వహిస్తారని, అసాంఘిక శక్తులు గురించిన సమాచారం ఏదైనా ఉంటే ప్రజలు ఈ బృందాలకు తెలపాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, ఒఎస్‌డి జె. రామ్మోహన రావు, విజయనగరం డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్, ఎస్బీ డిఎస్పీ సి.ఎం. నాయుడు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, ఎస్బీ సిఐలు వై.వి. శేషు, జి. రామకృష్ణ, డిసిఆర్‌బి సిఐ వి.వి. అప్పారావు, విజయనగరం 1వపట్టణ సిఐ ఎర్రంనాయుడు, ఆర్‌ఐలు శ్రీహరిరావు, గురునాధ రావు, రామకృష్ణ, రమేష్, పలువురు ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలగణపతి యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి జయంతి



పరవాడ:మండలకేంద్రమైన పరవాడ సంతబయలగల హనుమాన్ జయంతి బాలగణపతి యువజన సేవా సంఘంవారి అద్వర్యంలో బుధ వారము అంగరంఘ వైభవంగా జరిగింది. భక్తులు అందరూ అలయము వద్దకుచేరుకోనీ స్వామి వారిని దర్శించుకున్నారు. పరవాడ తాజా మాజీ సర్పంచ్ చుక్కరాము నాయుడు, ఎంపిటిసి సభ్యులు పైలశ్రీను వాసురావు, సిరపురపు అప్పల నాయుడు, పైలపోతినాయుడు, పైల హరేష్ ,గండి ఈశ్వరావు తథితర్లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరము మద్యహ్నం ఏర్పాటుచేసిన బారీఅన్న సమారాధనకు భక్తులు వద్దనుండి విశేషస్పందన లభించింది. భక్తులు అందరూ ఈ కార్యక్రమంలో పోల్గోనీ స్వామివారి ప్రసాదమును స్వీకరించారు. సాయంత్రము ఏర్పాటుచేసినపలు సంస్కృతి కార్యక్రమాలు ప్రజలును ఏంతగానో అకట్టు కున్నాయి. ఈకార్యక్రమంలో చుక్క సన్యాశిరావు, పైడి రాజు, చినఅక్కు నాయుడు, బంగా రము, వెంకటేష్ బాలగణపతి యువజన సేవాసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీక్షేత్రమ్‌లో ఘనంగా హనుమాన్‌జయంతి ఉత్సవ వేడుకలు

విజయనగరం: ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై యున్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, భద్రం విద్యాసాగర్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ఆంజనేయస్వామికి 14 రకాలైన ద్రవ్యములను సమర్పిస్తూ, స్వామికి ప్రీతిపాత్రమైన మన్యుసూక్తమును 14 సార్లు పారాయణం గావించారు. అనంతరం తమలపాకులతో సహస్రనామార్చన, సింధూరముతో అష్టోత్తరనామార్చన గావించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ, గిరిజా ప్రసన్న, ప్రకాష్, శ్రీను, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కవి సమయం

### 'నా పల్లె'

ఒకనాటి నా పల్లె
ఎర్రబస్సు దిగి పల్లెకు పోతుంటే
పచ్చని జొన్నచేల మధ్య మంచెకావల్లు
దారి పొడుగునా ఆప్యాయంగా పలకరింపులు
మామిడి, పూలతోటలమాటున పక్షుల కిలకిలలు
తంగేడు గుమ్మడి పూలబతుకమ్మ ఆటలు
ఏ గుడిసె ముందు నిలబడినా
సేద తీర్చుకోమని చల్లని మజ్జిగ ఇచ్చిన అక్కలు
పట్నంలో ఏం చేస్తున్నావురా అంటూ
ఆప్యాయంగా చేతిని నిమిరిన అమ్మలు
నేడు అవి అన్ని కానరాకుండా పోయాయి
గుడిసెల స్థానంలో భవంతులు
గుడిసెలలో జనం సుదూర ప్రాంతాలకు వలసలు
రోగాలతో చెట్ల క్రింద మూలుగుతున్న ముదుసలులు
భవంతులతో టి.విలకు అతుక్కుపోయిన కొందరు
తండ్రి కొడుకులతో మాట్లాడలేని బిజిబిజి
తమ్సుఅప్‌ల రసకేళీ బ్రాంది బీర్ల దుకాణాలు
ఇంటర్‌నెట్‌లో చాటింగ్‌లు
పేదల సమాధులపై పెద్దల విహార కేళి
పల్లె మారింది పల్లె సంస్కృతి మారింది

... కవితా రచన
తుంపాల శ్రీరామమూర్తి

## పంచాంగం

మాసం : వైశాఖ తిథి : ఏకాదశి సా. 4.38
రేవతి రా.11.03 ప.వ. 10.10ల 11.53

గురువారం
30 -05 -2019

a **మేషం** : గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లబి.స్తుంది. అసాధ్యమనుకున్న పనుసు తేలికగా పూర్తి చేస్తారు. రాజకీయ నాయకులు తరచు సభాసమావేశాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సాహం లభిస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ఖర్చులు అధికమవుతాయి. b **వృషభం** :ఆర్థిక, కుటుంబ పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలు మీరే సమీక్షిం చుకోవడం మంచిది. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి పెరుగుతుంది. శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. వీలైనంత వరకు బయట ఆహారం తీసుకోవడం చేయకండి. మీ మంచితనమే మీకు శ్రీరామ రక్షగా ఉంటుంది. దూరప్రయాణాలు తప్పవు. c **మిథునం** : వృత్తి వ్యాపారాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలలో అప్రమత్తత అవసరం. ప్రతి పని చేతిదాకా వచ్చి వెనక్కిపోవడం వల్ల ఆందోళన పెరుగుతుంది. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. d **కర్కాటకం** : ఆర్థిక విషయాల్లో మీ లెక్కలు తారుమారు కాగలవు. స్త్రీలకు ఒక స్థిరాస్తి అమర్చుకోవాలనే ఆలోచన స్ఫురిస్తుంది. రాబడికి మించిన ఖర్చులుంటాయి. చేతిలో ధనం నిలబడటం కష్టమే. సోదరీ, సోదరులతో ఏకీభావం కుదరగలదు. భాగస్వామిక సమావేశాల్లో కొత్త అంశాలు చర్చకు వస్తాయి. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం. e **సింహం** : బృంద కార్యక్రమాల్లో పాల్గొంటారు. మీ ఏమరు పాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చుకుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారులను ఆకట్టుకుంటారు. మీ శ్రీమతి ఆరోగ్యంలో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. వైద్యులకు ఒత్తిడి, ఇంజనీరింగ్ రంగాల్లో వారికి చికాకు తప్పదు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. f **కన్య** :ఉద్యోగస్తులు పై అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ అవసరం. బ్యాంకింగ్ వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త పడండి. నూతన పెట్టుబడుల విషయంలో జాగ్రత్త తప్పదు. గృహంలో ఒక శుభకార్యం సానుకూలమవుతుంది. ట్రాన్స్‌పోర్ట్, ట్రావెలింగ్ రంగాల వారికి చికాకులు తప్పవు. g **తుల** : ఉమ్మడి వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలు సమర్థవంతంగా నిర్వ హిస్తారు. వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి పెరుగుతుంది. స్త్రీలకు ఆభరణాలు, విలాస వస్తువుల పట్ల మక్కువ పెరుగుతుంది. h **వృశ్చికం** : స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి సదవకాశాలు లభిస్తాయి. సోదరీ, సోదరుల మధ్య సంబంధ బాంధవ్యాలు బాగుంటాయి. ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెలకువ అవసరం. ప్రత్యర్థులు మిత్రులుగా మారుతారు. చేస్తున్న ఉద్యోగాలను తొందరపడి వదులు కోవద్దు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. i **ధనుస్సు** : ఫైనాన్సు, షేర్ వ్యాపారులు తెలివిగా ప్రవర్తిస్తే మంచి లాభాలు పొందు తారు. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

## ఉపాధి డబ్బులు ఇవ్వాలని ఉపాధి హామీ కూలీలు ధర్నా



నాతవరం : నాతవరం మండలం పి.జగ్గంపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు జనవరి నెల నుంచి ఇప్పటి వరకు ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల ఎపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి డొక్కా అజయ్‌బాబు మాట్లాడుతూ పి.జగ్గంపేట ఉపాధి కూలీలకు కష్టానికి తగ్గ వేతనం ఇవ్వడం లేదన్నారు. కష్టపడిన తర్వాత డబ్బులు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉపాధి కూలీలకు కనీసం రూ.500లు రోజు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే కూలీలకు రావల్సిన బకాయిలు చెల్లించాలని లేకుంట సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎపిఒ శ్రీనివాస్‌కు వినతిపత్రంఅందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# సాయిబాబా చిన్న కథలు



### దేశాభిమానం

ఈ విషయాన్ని తెలుసుకుని ఆయన తండ్రి సుభాష్‌ను లండన్‌కు పంపించాడు. అక్కడ శ్రద్ధాభక్తులతో చదివి ఐ.సి.ఎస్. పాస్ అయి స్వదేశమునకు తిరిగి వచ్చాడు. అతని దేశాభిమానం ఇంకా అధికమైంది. రాజకీయ రంగంలో ప్రవేశించాడు. అత్యుత్తమమైన నాయకత్వమును వహించి దేశ సేవ చేశాడు. అతని తదనంతరం చరిత్ర ఏమని చాటుతుంది? దేశాభిమానమునకు తన సర్వస్వమును అర్పించిన త్యాగమూర్తి సుబాష్ చంద్రబోస్ అని, అతని అభిమానులు అతనిని "నేతాజీ" అంటారు.

### "నశ్రేయో నియమం వినా"

ఇంగ్లాండ్ దేశంలో ఒక గ్రామంలో ఒక రైతు పాలవ్యాపారం చేస్తూ ఉండేవాడు. తన నిత్య జీవితములో సత్య ధర్మములను అనుసరిం చేవాడు. పాలను ఎక్కువ లాభమునాశించక న్యాయ ముగా అమ్మే వాడు. పాలు కూడా మంచివే అందించేవాడు. ఒకసారి వరుసగా కొన్ని దినములు అతను అమ్మే పాలలో మార్పు గుర్తించారు కొందరు. ఇతని మీద న్యాయ స్థానంలో రిపోర్టు చేశారు. ఇతడు సరియైన పాలను విక్రయించడం లేదని, దానిపైన విచారణ ప్రారంభమైంది. రైతును పిలిచి అనేక విధములుగా ప్రశ్నించారు. రైతు ఉన్నది ఉన్నట్లు వివరించి సత్యమును దాచక చెప్పాడు. న్యాయాధికారి తానే స్వయముగా కొంతమంది వ్యక్తులను తన వెంట తీసుకుని రైతు ఇంటికి వెళ్లి పాలను పితికించి పరీక్షించారు. ఆ పాలు చెడినవిగా నిర్ణయమైంది. ఇది రైతు దోషము కాదు. పశువులో ఏదో దోషముందని నిర్ణయించినట్లు మరల విచారణ కొనసాగించాడు. రైతుతో చనువుగా వుంటూ వారి యింటిలోనే ఒక వ్యక్తి వుండేటట్లు ఏర్పాటు చేశాడు. న్యాయాధికారి, రైతు తన యింటిలోని చికాకుల వలన, కొంత అశాంతి వలన సకాలములో పశువు నుండి పాలు పితకలేక పోతున్నాడు అని ఆ వ్యక్తి గమనించాడు. సమయం చిక్కినప్పుడల్లా పాలను పితకడం, అమ్మడం ఈ విధంగా చేశాడు. అనగా ఒక నిర్ణీత సమయంలో పాలు పితకడం మావేశాడు. ఈ విషయమును న్యాయాధికారికి తెలిపాడు. రైతు యింటిలో వుండి అన్నీ గమనించిన వ్యక్తి.

న్యాయాధికారి చక్కగా విచారణ చేసి పశువులు కూడా ఒక నియమిత కాలంలో పితికితేనే సరియైన పాలు ఇవ్వగలవని తెలుసుకున్నాడు. నియమాన్ని ఉల్లంఘించినపుడు పశువుల పాలలో మార్పు కలుగుతుందని తెలుసుకున్నాడు. ప్రపంచములో ప్రతీ చర్యకు ఒక నియమము వుంటుంది. నియమము చాలా ప్రధానమైనది. మానవుడు ప్రకృతికి సంబంధించిన నియమాలను గుర్తించి వర్తించాలి. అందుకనే "నశ్రేయో నియమం వినా" అన్నారు.

...సశేషం

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# పరవాడలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



పరవాడ: మండల కేంద్రమైన పరవాడ పెట్రోల్ బంక్ వద్ద గల ఆంజనేయస్వామి జయంతి వేడుకలు బుధవారము ఘనంగా జరిగాయి. వేకువజామునుండే భక్తులు అందరూ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వైసీపీ రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు, పరవాడ మాజీసర్పంచ్ చుక్క రామునాయుడు, ఎంపిటిసి సభ్యులు సిరపురపు అప్పల నాయుడు, పైల అప్పల నాయుడు, వెన్నెల సన్యాశిరావు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరము ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు ప్రజలు వద్ద నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి మల్లాడి

యానాం : నియోజకవర్గంలో కోట్లాది నిధులు చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పుదుచ్చేరి ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి కృష్ణారావు అధికారుల బృందం పరిశీలించారు. కురసాంపేట, కనకాలపేటల మీదుగా సుమారు 25 కోట్లతో నిర్మితమవుతున్న లికింగ్ ఛానల్ పనులను, అలాగే పంపింగ్ పనులను పరిశీలించారు. కనకాలపేట నుండి కురుసంపేట మీదుగా పురంపేట, దరియాలతిప్ప ప్రధాన పంటకాలువ వరకు భూగర్భ పైపులైను పనులు ఇప్పటికే పూర్తి అయినవి. కొరంగి నదిపాయపై శరవేగంగా పైపులైను పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే వచ్చే లోలకణి సొసైటీ రైతులకు రెండు పంటలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడుతుంది. అలాగే గోపాల్‌నగర్‌లోని మత్స్యశాఖ కార్యాలయం వద్ద 5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం పరిశీలించారు. 2 కోట్లతో గోపాల్‌నగర్ ప్రధాన డ్రైయినేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. బుధవారం జాలెండ్ భూములు నెంబరు 3, సావిత్రినగర్‌లో పనులను, టవర్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వివిధ ప్రాంతాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి శివరాజ్ మీనా, కుమార్, దారా సుబ్బరాజు, కాళ్ల నాగరాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మొండికేస్తున్న సర్వర్లు...

విజయనగరం: గతంలో అలసత్వం కేవలం సిబ్బంది వరకే కన్పించేది. అయితే ఇప్పుడు సాంకేతిక పనివారల్లో..సాంకేతిక పరికరాల్లో కూడా అది గమనించవచ్చు. నిత్యం రద్దీగా ఉన్న మీ-సేవ..ఈ-సేవ కేంద్రాల్లో..అలాగే రవాణాశాఖలో నిత్యం ఎదుర్కొనే సమస్య సర్వర్లతోనే ముడిపడి వుంటుంది. మాయల ఫకీరు ప్రాణంలో చిలకలో ఉంటుందని తెలిసింది. దాంతో అన్ని జిల్లాల్లో మొరాయించిన సర్వర్ల వల్ల పనులు మధ్యలో ఆగిపోయి..కొన్ని మర్నాటికి వాయిదా పడి ఇలా నిత్యం వాటి బారిన వినియోగదారులు విసుగెత్తిపోతున్నారు. నిజానికి ఇది కేవలం రాష్ట్ర సమస్య మాత్రమే కాదు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో కూడా ఇంకా బిఎస్ఎన్ఎల్ వారు తగిన విధంగా లైన్లు వేయకపోవటం కూడా కారణమే! వారికి ఎదుగుతున్న జిల్లాలు ఎందుకు కన్పించవో తెలియదు కాని, వారు పనిచేయడానికి ..వారి ఆదాయవనరులకు కావలసినంత అవకాశం ఉన్నా సైబర్‌నెట్‌వర్క్ విషయంలో మందకొడిగా పనులు జరుగుతాయి. టవర్స్ వేయరు. వేసిన గోతులు పూడ్చరు. ఇలా నిత్యం వారితోఅనుబంధాలున్న వాఖలన్నీ ఎప్పుడు సిగ్నల&్స వస్తే అప్పుడే పనిచేస్తుంటారు. వారు సరే కష్టమర్లు, లబ్ధిదారులు లేదా ఏపేరున పిలిచినా...వివిధ శాఖల్లో నెట్ వర్స్‌తో, సర్వర్లుతో పనిచేసుకునేందుకు వచ్చే వారంతా బాధితుల జాబితాలో చేరి విసిగి వేశారుతుంటారు.

## అంగన్వాడీ కేంద్రాల ద్వారానే పౌష్టికాహారం



సామాజిక తనిఖీల ద్వారా తల్లులు నుండి వివరాలు సేకరిస్తున్న సిడిపిఒ

గొలుగొండ : అంగన్వాడీ కేంద్రాల ద్వారానే ప్రతీ గర్భిణీ, బాలింతకు పౌష్టికాహారం అందుతుందని నర్సీపట్నం ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.శ్రీకళ తెలిపారు. బుధవారం చీడిగుమ్మల అంగన్వాడీ కేంద్రంలో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసిన సరుకులు వివరాలు పరిశీలించారు. అలాగే తల్లులకు అవి సక్రమంగా అందాయా లేదా అనే అంశంపై తల్లులు, గర్భిణులు నుండి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సామాజిక తనిఖీలు ప్రతీ కేంద్రంలో నిర్వహించి ప్రభుత్వం నుంచి వచ్చిన సరుకులు సక్రమంగా అందుతున్నాయో లేదా అనే అంశాలు పరిశీలించి నివేదిక ఉన్నతాధికారులకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఐ.సత్యవతి, సిబ్బంది సత్య పాల్గొన్నారు.

# శ్రీ కాశ్యప్ డిగ్రీ విద్యార్థుల విజయభేరి




విశాఖపట్నం : 2019 మార్చిలో జరిగిన ఆంధ్రా యూనివర్సిటి వార్షిక డిగ్రీ తృతీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి విజయ భేరి మ్రోగించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న మా విద్యార్థిని చి. వై. శిరిష (హల్ టికెట్ నెం. 716133505110) 10.00 పాయింట్లకుగాను 9.90 పాయింట్లు సాధించి ఆంధ్రా యూనివర్సిటి పరిధిలో టాపర్ గా నిలిచినది. అంతే కాకుండా పి. అనూష -9.70, సి.హెచ్. యోగిత-9.60, అర్. శ్రావణి-9.50, వి. ధిక్షిత్ రాజు-9.40, కె. అన్నపూర్ణ-9.30, ఐ. వెంకట లక్ష్మి-9.30, మహ్మద్ బేగం-9.20, సాయి కార్తిక్-9.20, యస్. మాధురి-9.17, అంతే కాకుండా 9.00 దాటిన విద్యార్థులు 23 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తెలియజేశారు. సీనియర్ అధ్యాపకులు అందించిన శిక్షణతో మా విద్యార్ధిని, విద్యార్దులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని సెక్రటరి కరస్పాండెంట్ టి. రవి శంకర్ వర్మ తెలిపారు. ఈ విజయానికి కారకులైన కళాశాల అధ్యాపకులకు, విద్యార్దిని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు. ఈ సంవత్సరం జరిగిన ఆ-సెట్ ఫలితాలలో కూడా మా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రతి విద్యా సంవత్సరము ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ, సిఆర్‌టి ప్రొగ్రాంలను ప్రత్యేక సిబ్బందిచే శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మా కళాశాలలో ప్రత్యేక లైబ్రరీ, ల్యాబ్, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యతను యిస్తున్నామని తెలియజేశారు. అత్యధిక మార్కులు సాధించిన వై. శిరిష, వారి తల్లిదండ్రు లను ప్రత్యేక అభినంధన సభను నిర్వహించి కళాశాల యాజమాన్యం మరియు సిబ్బంది సన్మానించడం జరిగినది. ఈ కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డైరె క్టర్లు పి. సత్యనారాయణ, యస్.ఎన్.మూర్తి, అకడమిక్ కోఆర్డి నేటర్ కె. వెంకటేష్, యస్. శ్రీనివాసరావు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# హైకోర్డు న్యాయమూర్తికి వినతి

### -గాజువాకలో అవసరమైన న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి - గాజువాక బార్ అసోసియేషన్



గాజువాక: నగరానికి ధీటుగా పారిశ్రామికప్రాంతంగా శరవేగంతో అభివృద్ధి చెందుతున్న గాజువాకకు అవసరమైన న్యాయస్థానాలు లేక కక్షిదారులు,న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గాజువాక బార్ అసోషియోషన్ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వి.శేషసాయికి వినతి పత్రాన్ని బుధవారం అందజేసారు. ఈ సందర్బంగా గాజువాక బార్ అసోసియోసన్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రోజురోజుకు జనాభా పెరుగుతున్నారని, అలాగే అనేక విషయా లలో న్యాయంకోసం కోర్టులు చుట్టూ తిరుగుతున్నారని అయితే అందుకు తగిన న్యాయస్థానాలు లేక కక్షిదారులు, న్యాయవాదులు పలు సమస్యలు ఎదుర్కోంటున్నారని అన్నారు.

ప్రత్యేక కోర్టులు లేక చిన్న చిన్న కేసులకు నగరంలోని న్యాయస్థానానికి వెళ్ళవలసి వస్తుందని అన్నారు. సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు పరిధి విస్తారంగా ఉండడంతో తగిన న్యాయం కోసం ఎక్కువకాలం వేచి ఉండవలసి వస్తుందని, అలాగే కోర్టులో తగిన మౌళిక సదు పాయాలు లేవని అన్నారు. సుమారు రూ.52లక్షలతో నిర్మించిన పార్టీ షెడ్ తక్షణమే వినియోగంలోనికి తీసుకురావాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందిం చామని తెలిపారు. సమస్యలు విన్న న్యాయమూర్తి స్పందించారని తక్షణమే అవసరమగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో బార్ అసోషియోషన్ ప్రతి నిధులు కాండ్రేగుల లీలా హరి ప్రసాద్ ఉన్నారు.

# జెర్సీ డెయిరీ పాల ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించాలి

### పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అథీప్‌రాజ్ సతీమణి శిరీష



సబ్బవరం: జెర్సీ డెయిరీ పాల ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అథీప్‌రాజ్ సతీమణి శిరీష పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం కొటాన కాంప్లెక్స్‌లో జెర్సీ డెయిరీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పెందుర్తి ఎమ్మెల్యే సతీమణి అన్నంరెడ్డి శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని మండల జెర్సీ పాల ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించాలని ప్రజలను కోరారు. మిగతా డెయిరీలానే ఈ డెయిరీకీ చేయూతనందించాలన్నారు. జెర్సీ డెయిరీ మన రాష్టంలోనే కాకుండా ఏడు రాష్ట్రాల్లో పాల ఉత్పత్తులను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలోబిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, జిల్లా అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు, ఏ.అజయ్‌రాజ్, మండల సముద్రం, మళ్ల కోటి, కర్రిబాబు, వడ్డాది అప్పలరాజు, ధనిమరెడ్డి శ్రీను, బైలపూడి దేముడు, బైలపూడి రామారావు,టి. శేఖర్, డెయిరీ మేనేజర్ పి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మాధవధారలో వెలసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో

# ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు





మాధవధార : హనుమాన్ జయంతి సందర్భంగా మాధవధారలో వెలసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళిదంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం వివిధ సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. నేల భల వేషధారులు భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సుమారు 3000 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు.

### నేడు పరవాడ ఎమ్మెల్యే

# అధీప్‌రాజ్ రాక

**నాయకులు, కార్యకర్తలకు పైలా, సిరపురపు పిలుపు**

పరవాడ : పెందుర్తి స్థానిక శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుదవారము పరవాడలోజరిగేపలుకార్యక్రమాలుకు హాజరు అవుతారని రాష్ట్ర సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు, వైసిఎ ి మండలపార్టి ప్రెసిడెంట్ సిరపురపు అప్పల నాయుడు తెలిపారు. మంగళవారము వీళ్ళ విజయభాను ప్రతినిదితో మాట్లడుతూ స్థానికఎమ్మెల్యేఅన్నంరెడ్డిఅదీప్ రాజ్ పరవాడలో జరిగే పలుకార్యక్రమాలుకుహజరు అవుతారనీ అన్నారు. ముందుగాఅయన పరవాడలోజరిగేహనుమాన్ జయంతి కార్యక్రమంలో పాల్గోంటారనీ, అనంతరమువైసిపిమండలయూత్ అధ్యక్షులు పెదిశెట్టి శేఖర్ ఇంటికివెళ్ళినూతనవదువరులును అశ్వీర్ది స్తారనీ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలములోగలవైసిపినాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హజరుకావాలని కోరారు.

### 'జగన్' ప్రమాణ స్వీకారానికి

# మంత్రి మల్లాడికి ఆహ్వానం

యానాం : ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి (జగన్) పదవి ప్రమాణ స్వీకారోత్సవానికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావును జగన్ ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఈనెల 30వతేదీన విజయవాడ ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో జరగనున్న సిఎం పదవీ ప్రమాణ స్వీకార ఉత్సవంలో పాల్గొంటున్నారు. మరలా జూన్ 10వతేదీన జగన్‌ను కలిసి, యానాంలోని పలు సమస్యలు, ప్రక్క నియోజకవర్గంలోని ప్రజలు చెప్పిన సమస్యలు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

## కార్డు చెల్లింపులు పట్టణాలకే పరిమితం కాదు

విశాఖపట్నం : భారతీయ మార్కెట్ లోకి కార్డులు ప్రవేశించిన నాటి నుంచి మనం ఎంతో దూరం వచ్చాం. నేడు ప్రజల చేతుల్లో 971 మిలియన్ క్రెడిట్ మరియు డెబిట్ కార్డులు ఉన్నాయి. వీటిలో అత్యధికం గత 3 ఏళ్ళలో పట్టణాల్లో మరియు పల్లెల్లో వినియోగదారులకు ఒకే తరహాలో జారీ అయినవే. ఫలితం గా మనలో చాలామంది మన వాలెట్స్ లో కనీసం ఒక కార్డు అయినా కలిగి ఉంటారు. మరి మనం నిజంగా దాన్ని ఉపయోగిస్తున్నామా? ఒక కొత్త వినియోగదారుడికి డెబిట్ కార్డు అంటే తాను మారిపోవాల్సిన డిఫాక్టో డిజిటల్ చెల్లింపు విధానం అని అర్థం. దీన్ని అర్థం చేసుకోవడం మరియు వినియోగించడం ఎంతో సులభం. ఖర్చులన్నీ ఆ వ్యక్తి బ్యాం కు ఖాతా బ్యాలెన్స్ నుంచి తగ్గించబడుతాయి. నగదు సమకూర్చుకోవడం వంటి ఇబ్బందులు లేకుండా రోజువారీ వ్యవహారాలన్నీ కూడా కార్డు ద్వారా నిర్వహించుకోవచ్చు. ఖాతా స్టేట్ మెంట్ ద్వారా ఆ వ్యయాలను ట్రాక్ చేసుకోవచ్చు.

### జూన్ 1వతేదీన

# పుదుచ్ఛేరి మంత్రి వర్గ సమావేశం మంత్రి మల్లాడి

యానాం : పుదుచ్చేరి మంత్రివర్గ సమావేశం జూన్ 1వతేదీన జరపడానికి ముఖ్యమంత్రి వి.నారాయణసామి నిర్ణయించారని పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. యానాంకు సంబంధించిన 21 సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరామన్నారు. అందులో కనకాలపేట ఇల్లు స్థలాలు, భూములు, జిఎన్ఎం కళాశాల నిర్మాణ పనులు, మరో 13 సమస్యలు సీఎంకి, మంత్రులు దృష్టికి తీసుకెళ్ళి నిధులు విడుదల చేయాలని కోరామన్నారు. జిఎస్‌పిసి నష్టపరిహారం నిధులు విడుదల చేయాలన్నారు. పుదుచ్ఛేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి ప్రభుత్వ వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎల్‌జి దృష్టికి వెళ్ళకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అమలుకు నిధులు, రెగ్యులర్‌గా బియ్యం పంపిణీ, పసుపు రేషన్‌కార్డుదారులలో రెగ్యులర్ ఉద్యోగులు, ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నవారికి బియ్యం నిలుపువేసి మిగిలిన వారికి బియ్యం పంపిణీ చేయాలన్నారు. &బ్రీపతి నెల బియ్యం నిలుపుదల చేయకుండా ఇవ్వాలన్నారు. 7 రోజులలో దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. పుదుచ్ఛేరి చరిత్రలో కాంగ్రెస్ పార్టీకి 1.97 వేలు ఓట్లు మెజార్టీతో గెలవడానికి ఎల్‌జి వ్యతిరేక విధానాలు వలన సాధ్యమయిందన్నారు. నేను చెప్పిన విషయాన్ని అందరూ హర్షించారన్నారు. ఎంపీగా ఎన్నికైన వి.వైథిలింగంను జూన్ 3వతేదీన అసెంబ్లీ సమావేశంలో సత్కరిస్తామన్నారు. స్పీకర్ పదవికి 4 అభ్యర్థులు పోటీ పడుతున్నారని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. యానాంలో తాగునీటి నూతన పైపులైన్లు పనులను వెయ్యడానకి జెఎన్‌టియు వారి రిపోర్టు ఆధారంగా 3 వర్కులుగా విభజించి ప్రతిపాదనలు సిద్ధం చేసి 10 కోట్లు వ్యయంతో పనులు చేపడతామన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలని, ముగిసిన తరువాత ప్రజా సంక్షేమం కోసం పనిచేయడం, అందరిని కలవడం జరుగుతుందన్నారు.

## పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి

విజయనగరం: పట్టణం కంటోన్మెంటు పోలీసు లైన్సులోగల అభయాంజనేయ దేవాలయంలో హనుమాన్ జయంతిని వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఈ వేడుకల్లో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆర్ఐ శ్రీహరిరావు మరియు ఇతర పోలీసు అధికారులు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్‌కు స్వాగతం పలికారు.

# ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పారిశుధ్యం నిర్వహించండి : కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం : ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పారిశుధ్యం పనులు నిర్వర్తించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా మూడవజోన్, 20వ వార్డు క్రిష్ణానగర్, మహరాణిపేట, బీచ్ రోడ్‌లో బుధవారం పర్యటించి పలు సూచనలు చేశారు. అందరు సిబ్బంది, స్వచ్ఛవిశాఖ, ఆరోగ్య విశాఖ లక్ష్యంగా నిరంతర పారిశుధ్యం నిర్వహించాలని పేర్కొన్నారు. అన్ని డ్రెయిన్లు, రోడ్ మార్జిన్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ కూడలిలో భూగర్భ విద్యుత్ కనెక్షన్ల కోసం త్రవ్విన గోతులకు బారికేడ్లు వేయకుండా వదలి వేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మనుషుల ప్రాణాలకు హాని కలిగేవిధంగా నిర్లక్ష్యం వహించినందుకు ఒక్కొక్కరికి ఉన్న ఖాళీ స్థలంలో ఓపెన్ ఫోగులు వేసి ఉన్నందున వాటిని శుభ్రం చేసి రూ.5 వేల జరిమాన విధించాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు గల మార్గాన్ని మరింత పరిశుభ్రం గావించాలని సూచించారు. వివిధ ఆసుపత్రులను బయోవేస్ట్, చెత్త ఎలా నిర్వహిస్తున్నారు అడిగి తెలుసుకొన్నారు. అపార్ట్‌మెంట్లలో తడి-పొడి చెత్త వేరుగా డస్ట్ బిన్లలో నిల్వ ఉంచి పారిశుధ్య కార్మికులకు అందజేస్తున్నది లేనిది పరిశీలించారు. తడి-పొడి చెత్త వేరుచేసి అందజేయక పోవడంతో బాటు డస్ట్‌బిన్స్ కూడా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా 20వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సరైన పర్యవేక్షణ లేకుండా విధి నిర్వహణలోపాలను గమనించి వార్డు ప్రత్యేక అధికారి, జోనల్ కమిషనర్, ఏ.యం.ఓ.హెచ్‌లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి - పొడి చెత్తను డస్ట్‌బిన్స్‌లో వేరు వేరుగా ఇవ్వకుంటే ఆయా అపార్ట్‌మెంట్లకు వాటర్, యుజిడి, కనెక్షన్లను బంద్ చేయాలని, ఆదేశాలు పాటించని సిబ్బంది, అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో మూడవ జోనల్ కమిషనర్ చిట్టిబాబు, ఇ.ఇ గణేష్ కుమార్, ఏ.యం.ఓ.హెచ్ డా.సుధాకర్, ఏసిపి సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు , డి.ఇ కుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణుని బోధనలు యువతకు స్ఫూర్తిప్రదాయం

## కాకినాడ జిల్లా కలక్టరు కార్తి కేయ మిశ్రా



కాకినాడ : రామకృష్ణ పరమహంస ప్రభోదాలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన సమాజానికి సేవ చేసి ఖచ్చితమైన ధర్మాన్ని భోదించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోని ప్రజలకు సేవ చేయాలని జిల్లా కలక్టరు కార్తి కేయ మిశ్రా తెలిపారు. బుధవారం కాకినాడ శాంతి నగర్ లో గల శ్రీరామకృష్ణ సేవా సమితి మందిర పునఃప్రతిష్టా కార్యక్రమంలో కలక్టరు కార్తి కేయ మిశ్రా పాల్గొని శ్రీరామకృష్ణ పరమహంస, శారదాదేవి, వివేకానంద చిత్ర పటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టరు కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ ఈ సంస్థ నిర్వహిస్తున్న రామకృష్ణ పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై మంచి శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందిస్తున్నారని కలక్టరు తెలిపారు. వివేకానంద సాహిత్యం ద్వారా సమాజంలో ఏమి చేయాలి, ఏమి చేయకూడదనే ఖచ్చితమైన ధర్మాన్ని, విధానాన్ని బోధిస్తున్నారని ఆయన చెప్పారు. చాలా మంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, సమాజ సేవను నేర్పిస్తున్నారని, తద్వారా వీరు సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలన్నారు. రాబోయే తరాల వారికి రామకృష్ణ పరమహంస ప్రభోధాలు, వివేకానంద సేవ భావాన్ని, సాహిత్యాన్ని నేర్పించాలన్నారు. సమాజంలోచాలా స్వచ్ఛంద సంస్థలు రిజిష్టరు చేసుకొంటున్నారని, నిజంగా పేదలకు, అనాధ బాలబాలికలకు మహిళలకు సేవ చేసే వారు తక్కువగా ఉన్నారన్నారు. రామకృష్ణ సేవా సంస్థ సమాజ సేవ చేసి విద్యార్థులకు, మహిళలకు, పేదవారికి సహాయ సహకారాలు అందిస్తున్నదన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుండి వారి భవిష్యత్ పై నమ్మకం కలిగించాలని, వారికి మనం సపోర్టు చేస్తే మంచి జీవితాన్ని అందిపుచ్చుకొంటారని కలక్టరు తెలిపారు. విద్యార్థులకు అమర చిత్ర కథలు అనే పుస్తకాలను కలక్టరు పంపిణీ చేసారు. అదే విధంగా రామకృష్ణ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, సేకరించిన 1,16,435 రూ.లు విరాళంను కాశ్మీరులోని తులు.మా అమరవీరుల సంక్షేమానికి కలక్టరు కార్తికేయమిశ్రా అందజేసారు.

ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు సి.సూర్యనారాయణ, విశాఖపట్టణం సంస్థ అధ్యక్షులు స్వామి ఆత్మ విదానంద, రాజమండ్రి అధ్యక్షులు స్వామి వినిశ్చిలానంద, శాంతిమయనంద పాల్గొని ప్రవచనాలు చెప్పారు.

# ఘనంగా వైఎస్సార్సీపీ ఆత్మీయ సమావేశం



పరవాడ:యాభైఅరోవవార్డులంకెలపాలెం శ్రీసంపత్ విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంజరిగింది. వైస్సార్సీపీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పెందుర్తి నియోజకవర్గంలో పోటీ చేసి అత్యధిక మెజారిటీతోగెలిపొందారు.దీనికిసంబందించి బుదవారము లంకెలపాలెం శ్రీ సంపత్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి వారి స్వగృహంలో కేక్ కట్చేసి మహిళ కార్యకర్తలుతో ఎంతో ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎడ్యుకేషన్ సొసైటీ గెడ్డం ఉమా పాల్గొన్నారు. అనంతరం అమె మాట్లాడుతూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ పెందుర్తి నియోజకవర్గంలో కానీ రాష్ట్ర స్థాయిలో కానీ 151 సీట్లు మెజారిటీతో వై.యస్ జగన్మోహన్ రెడ్డి గెలవడానికి ముఖ్యంగా అటు యువత ఇటు మహిళలు సహకారం ఎక్కువగా ఉందని తెలిపారు. ఇక్కడ పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ అత్యదికమెజారిటీతో గెలవడం చాలా సంతోషంగా ఉందని అమె తెలిపారు. అనంతరం ఏర్పాటుచేసినవిందును స్వీకరించారు. ఈకార్యక్రమంలో మహిళలు తథితర్లుఅదికసంఖ్యలో పొల్గొన్నారు.

# ఘనంగా అభయ ఆంజనేయస్వామి జయంతి మహోత్సవాలు



భీమునిపట్నం: భీమునిపట్టణం అభయ ఆంజనేయస్వామి దేవాలయం లో హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘణంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లచ్చుబుగత రామకృష్ణ లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జయంతి మహోత్సవం లో ఉదయం 5గంటలకే శ్రీ ఆంజనేయస్వామి వారికి సుగంధ ద్రవ్యాల పంచామృతాలతో అభిషేకాలు, 6గంటలకు పాలాభిషేకం, అష్టోత్తర,సహస్రనామ పూజలు,ఘనంగా నిర్వహించారు. ఉదయం11 గంటలకు అడిదం సన్యాసి రాజు బృందం చే హనుమాన్ చాలీసా, సుందరకాండ, రామభక్తి గీతాలు ఆలపించారు. రామభక్తి గీతాలకు భక్తులు పరవశించి పోయారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ అన్నసమారాధన లో సుమారు రెండు వేల మంది పాల్గొన్నారు .సాయంత్రం 6 గ ం ట ల క ు దూప,దీపాలతో,హారతి ముగింపు కార్యక్రమం జరుగుతుంది భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అప్పికొండ అప్పలనాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, సాగి అప్పల నర్సింహరాజు, కర్రోతు రమణ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యుట్ వల్ల ఐదు పూరి ఇల్లు దగ్ధం



భీమునిపట్నం: భీమిలి మండలం బోడమెట్ట పాలెం మధుర రామునాయుడు పేట లో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్కుట్ వల్ల ఐదు పూరి ఇల్లు పూర్తి గా దగ్దం మయ్యాయి ఆ సమయం లో స్థానికులు అగ్ని మాపక సిబ్బంది సమాచారం ఇవ్వడం తో ప్రాణ నష్టం జరగలేదు. భాదితుల ఇల్లు కాలిపోవడం తో వారు కట్టుబట్టల తో వారు మిగిలారు ఇల్లు కొల్పోయిన బొట్టా రామసూరప్పడ ఇంటి లో మూడు లక్షలు, బొట్ట బాబురావు రెండులక్షలు, బొట్ట తాత రెండు లక్షల ఎబైవేలు, పడగల రామస్వామి కి లక్షా ఏబై వేలు, పడగల రాంబాబు రెండు లక్షల ఏబైవేలు ఆస్థి నష్టం జరిగిందని భీమిలి తహసిల్దార్ కళ్యాణ చక్రవర్తి చెప్పారు.

# ఉచిత శిక్షణా తరగతులు ముగింపు



భీమునిపట్నం తగరపువలస కృష్ణా కాలేజ్ లో ఎబివిపి ఆద్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ మరియు స్పొకెన్ ఇంగ్లీషు తరగతులు బుదవారం తో ముగిసాయి.ఈ ముగింపు కార్యక్రమంకు ముఖ్య అతిధి గా భీమిలి ఎస్ ఐ పి.రాంబాబు విచ్చేసారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయి కి చేరుకొని దేశ భవష్యత్ కోసం తమ వంతు కూడా సమాజ సేవా చెయాలని అన్నారు.సోషల్ మీడియా పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు.ఆయనను కాలేజే కరస్పొండెంట్ బి నర్సింగరావు ఎస్ ఐ రాంబాబుని ని సన్మానించారు.ఈ కార్యక్రమం లో ఎల్ అచ్చిబాబు,కార్యదర్శి బి.రామకృష్ణ,మధు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం

భీమునిపట్నం: తగరపువలస వాస్తవ్యులు మణికంఠ స్వీట్స్, యం ఎఫ్ సి అధినేత ఆదిమూలం నాగరాజు బ్రదర్స్ మరియు వాణి స్కూల్ కిట్టు వారి ఆర్థిక సహాయంతో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయం వద్ద వుయ్ కేర్ యు మరియు హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది భక్తులు ఈ మజ్జిగ ఎండ తీవ్రత నుంచి సేదతీరారు ఈ కార్యక్రమం లో వుయ్ కేర్ యు సభ్యులు మరియు సాయిరాం యూత్ కిట్టు తదితరులు పాల్గొన్నారు

# సిఐటియు 50సం॥ల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి

విశాఖపట్నం: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఏర్పడి మే 30నాటికి 50 వసంతాలు పూర్తవుతున్నది. ఈ సందర్భంగా నేడు ఉ॥ 10గం॥లకు కళాభారతి ఆడిటోరియంలో రాష్ట్ర సభను నిర్వహిస్తున్నాం. దీనికి సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సిహెచ్.నరసింగరావు, కా॥ఎం.ఏ.గఫూర్‌లు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విశాఖ కార్మికసంఘాలు, సిఐటియు సభ్యులకు, కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

# నేడు భీమిలిలో వైఎస్సార్‌పిసి సమావేశం



భీమునిపట్నం: భీమునిపట్నం గురువారం .జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా భీమిలిలో వై సి పి కార్యాలయంలో నాయుకులు పలు కార్యక్రమాలు నిర్వహించునున్నట్టు తెలిపారు. అందులో ముందుగా వై ఎస్ ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కరుణాకర్ రెడ్డి, అల్లిపిల్లి నరిసింగరావు, కదిరి ఎల్లాజీ, వాసుపల్లి.కొండబాబు, బాకి.రమణారెడ్డి, ఆర్.ప్రభాకర్ నాయుడు, జి.మధునాయుడు, కె.కొత్తయ్యరెడ్డి,.రామసూరప్పడు, చెల్లూరి గౌరినాయుడు, ఎ.అప్పలనాయుడు, బోని సంజీవరావు, యమ్. లక్ష్మణరావు, ఎర్నింటి అప్పారావు, నరేంద్ర కుమార్. పాసి. స్వర్ణలత, .తధితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం



అచ్యుతాపురం : చట్టాలపై విద్యార్థులకు , యువతకు, ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఏ ఎస్ ఐ మల్లేశ్వరరావు అన్నారు .బుధవారం స్థానిక గ్రంధాలయంలో జరగుతున్న విజ్ఞాన వేసవి శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు . చట్టాలు గురించి తెలుసు కోవాలని, అలాగే వాటిని అతిక్రమిస్తే కలిగే నష్టాలను తెలుసుకోవాలన్నారు . ఎవరికైనా అన్యాయం జరిగితే పోలీసులకు తెలియజేస్తే వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు .విద్యార్థులు , యువత గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో గ్రంధాలయాధికారి డి కోటేశ్వరరావు తదితరులు ఉన్నా రు.

# జగనన్న పాలనలో రాజన్న రాజ్యంతో అభివృద్ధి సాధిద్దాం

## విశాఖలో పార్టీ ఓటమికి ఏ ఒక్కరూ కారణం కాదు

## రాష్ట్రంలో వైకాపా అఖండ విజయానికి అభినందన సభ

## వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస రావు



విశాఖ సిటీః విశాఖ దక్షిణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమికి తాను నైతిక బాధ్యత వహిస్తున్నానని, పార్టీ ఓటమికి ఏ ఒక్కరూ కారణం కాదని వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస రావు పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ సాధించిన విజయానికి గుర్తుగా విశాఖ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు చేపట్టి తక్కువ కాలమే అయినప్పటికీ అభిమానులందరూ నాయందు కృతజ్ఞతతో ఓటువేసినందుకు కార్యకర్తలు, అభిమానులందరికీ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గంలో ఓటమి పాలైనప్పటికీ అభివృద్ధిపట్ల అంకితభావం కలిగి ఉంటానని అన్నారు. రాష్ట్రంలో అధికారపగ్గాలు చేపట్టిన వైకాపా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. జగన్ సారథ్యంలో రాష్ట్రం పురోభివృద్ధి సాధించగలదన్న ధీమాను వ్యక్తం చేశారు. జగనన్న పరిపాలనలో రాజన్న రాజ్యాన్ని చూడగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. వైకాపా పాలనలో పేదప్రజలకు సైతం నవరత్నాలు అందించి తద్వారా అనేక సంక్షేమ పథకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అభినందన సభకు కోలా గురువులు, జాన్ వెస్లీ, గరికిన గౌరి, వుడా మాజీ చైర్మన్ మరియదాసు, కుప్పిలి వెంకట రమణ, సాయిలక్ష్మి, మహమ్మద్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యువరాజుకు పట్టాభిషేకం సీడీ ఆవిష్కరణ

## ఎమ్మెల్యే కన్నబాబుకు ఘన సన్మానం



కాకినాడరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవ్యాంధ్రా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార కార్యక్రమాలలో వేదికపై నుండి ప్రదర్శించే పాటల సీడీ కాకినాడ గ్రామీణ శాసన సభ్యులు కురసాల కన్నబాబు ఆవిష్కరించారు బుధవారం తన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో గేయ రచయిత డా.కోటి రూపొందించిన యువరాజు పట్టాభిషేకం 'రా...కదలిరా' పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రచరిత్రలో ఎన్నడు లేని విధంగా ఘన విజయం సాధించి మెజారిటీ సీట్లను కైవసం చేసుకుందన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార సభలో ఉత్తేజ కరమైన పాటలను ప్రదర్శించేందుకు డా.కోటి రాసిన పాటలు ఎంపిక అవ్వడం సంతోషదాయకమన్నారు. డా. కోటి మాట్లాడుతూ జగన్‌కు లభించిన విజయ స్ఫూర్తితో తాను ఈ పాటలను రూపొందించడం జరిగిందన్నారు.అనంతరం పాటల నిర్మాత ఆదికవి నన్నయ్యయూనివర్శిటి బోర్డు సభ్యులు మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ తాను నిర్మించినయువరాజు పట్టాభిషేకం యువముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డి సభలో వినిపించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.సీడి పాట ఎంపిక పట్ల సంతోషం వ్యక్తం చేసారు. అనంతరం ఎమ్మెల్యే కన్నబాబును దుశ్శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో దుగ్గనదొరబాబు, బత్తిన శ్రీనివాస్,నారపరెడ్డి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# 31నుంచే సచివాలయానికి సీఎం జగన్

అమరావతి: నవ్యాంధ్రకు రెండో సీఎంగా జగన్ 30న ప్రమాణ స్వీకారం చేస్తారు. 2014లో అధికారంలోకి రాలేకపోయినా 2019 అనుకున్నది సాధించి నేడు సీఎం పీఠాన్ని అధిష్టించనున్నారు. ఆయన ప్రమాణ స్వీకారం అనంతరం మోదీ ప్రమాణ స్వీకారానికి వెళ్లనున్నారు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత శనివారం నుంచే సచివాలయంలో కొత్త సీఎంగా జగన్ అడుగుపెడుతారు. ఇప్పటికే సచివాలయంలో అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం ఛాంబర్, కేబినెట్ హాల్, హెలిపాడ్, సీఎం కాన్వాయ్ రూట్‌లను ఆ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. జగన్ నేమ్ ప్లేట్‌ను కూడా సుబ్బారెడ్డి పరిశీలించి ఆమోదించారు.

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 30వ తేదీన వైస్ జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాణ స్వీకార ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ పర్యవేక్షించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రమాణస్వీకారానికి వచ్చే నేతలకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఇప్పటికే తన ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి చంద్రబాబును కాబోయే సీఎం జగన్ ఆహ్వానించారు. ఆయన మంగళవారం చంద్రబాబుకు ఫోన్ చేశారు. ఆ సమయంలో చంద్రబాబు పార్టీ కార్యక్రమంలో ఉండడంతో జగన్‌తో మాట్లాడేందుకు వీలు కాలేదు.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన వాసుపల్లి గణేష్ కుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న 24వ వార్డు టీడీపీ అర్బన్ జిల్లా తెలుగు మహిళా విభాగపు ఉపాధ్యక్షురాలు, జన్మభూమి కమిటీ సభ్యురాలు బెహరా వెంకటరత్నం.



# మార్చినాటికి 43వేలకు సెన్సెక్స్

**-ఆర్బీఐ పాలసీ, బడ్జెట్ నిర్ణయాలే కీలకం**
**-కోటక్ సెక్యూరిటీ అంచనా**

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ల ర్యాలీకి ఇప్పట్లో బ్రేక్‌పడే అవకాశాలు కనిపించడం లేదు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ మళ్లీ గద్దెనెక్కడంతో జోరుమీదున్న దేశీయ స్టాక్ మార్కెట్లు..ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి జెట్‌స్పీడ్ వేగంతో దూసుకుపోయే అవకాశాలున్నాయని పలు సంస్థలు అంచనావేస్తున్నాయి. ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వు బ్యాంక్ తీసుకోనున్న నిర్ణయాలు, 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో తీసుకోనున్న నిర్ణయాలు స్వల్పకాలంపాటు సూచీలు పుంజుకోవడానికి దోహదపడనున్నాయని కోటక్ సెక్యూరిటీస్ అంచనావేస్తున్నది. వీటితోపాటు అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు కూడా మార్కెట్లపై ప్రభావితం చేయనున్నాయని, ముఖ్యంగా అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధమేఘాలు, ఆర్థిక ఇబ్బందులపై స్పష్టత రావడంతో వచ్చే మార్చి నాటికి సెన్సెక్స్ 42,000 నుంచి 43,300 పాయింట్ల మధ్యలోకి చేరుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీ సర్కార్‌కు అత్యధిక మెజార్టీ రావడంతో సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారించనున్న అంచనాతో స్టాక్ మార్కెట్ల నిలకడైన వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని కోటక్ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవో కమ్లేష్ రావు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి జాతీయ స్టాక్ ఎక్సేంజ్ సూచీ నిఫ్టీ 12,500 నుంచి 13 వేల పాయింట్ల మధ్యస్థాయికి చేరుకోనున్నదన్నారు. సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు కావడం, భారత్ దేశంలోపల, బయల పలు సమస్యలతో సతమతమవుతున్నదని, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, దేశీయ ఆర్థిక రం గం మందకొడి వృద్ధిని నమోదు చేసుకోవడం వంటి అంశాలు ఉండనే ఉన్నాయన్నారు. మరోవైపు ఇంధన ధరలు ఉరుముతున్నాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర ప్రస్తుతం 70 డాలర్ల స్థాయిలో కదలాడుతుండటంతో దీర్ఘకాలికంగా దేశ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనే అవకాశాలు మెండుగావున్నాయని రావు చెప్పారు. ఇదే సమయంలో విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరుగడం సానుకూల అంశమన్నారు. దేశ వృద్ధి, పెట్టుబడులు, ఆర్థిక పరిస్థితులపై నూతన సర్కార్ దృష్టి సారించనున్నదని అనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గరిష్ఠ స్థాయికి చేరుకున్న ద్రవ్యలోటును నియంత్రించడానికి ఉద్దీపన ప్యాకేజీలే శరణ్యమని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకట్టుకోవాలంటే పలు రంగాల్లో సంస్కరణలకు పెద్దపీట వేయాలని, అప్పుడే వృద్ధిరేటు మరింత పుంజుకునే అవకాశం ఉందన్నారు. తయారీ రంగంలోకి మరిన్ని ఎఫ్‌డీఐలను ఆకట్టుకుంటే ప్రపంచ తయారీ రంగానికి భారత్ హబ్‌గా



మారనున్నదని, బీఎఫ్‌ఎస్‌ఐలో సంస్కరణలు, ప్రైవేటీ కరణ, ప్రభుత్వరంగ సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ, జీఎస్టీని మరింత సరళతరం చేయడం వంటి అంశాలు కూడా ఉన్నాయి. నరేంద్ర మోదీ సర్కార్ రెండోసారి అధికారంలోకి రావడంతో వరుసగా మూడోరోజు సెన్సెక్స్ రికార్డు స్థాయికి చేరుకున్నది. ప్రారంభం నుంచి తీవ్ర ఊగిసలాటలో కదలాడిన స్టాక్ మార్కెట్లకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీంతో బీఎస్‌ఈ సెన్సెక్స 66.44 పాయింట్లు లాభపడి 39,749.73 వద్ద రికార్డు స్థాయికి చేరుకున్నది. నేషనల్ స్టాక్ ఎక్సేంజ్ సూచీ నిఫ్టీ కూడా మరో నాలుగు పాయింట్లు లాభపడి 11,928.75 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్లో అత్యధిక విలువ కలిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు లాభాల బాట పట్టడం సూచీలు పుంజుకోవడానికి దోహదపడ్డాయి.




అమరావతి: భానుడి ప్రచండ ఉష్ణోగ్రతలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బయటకు రావాలంటేనే భయంతో సెగలు కక్కుతున్నారు. ఇంట్లో ఉక్కపోతతో విసుగెత్తిపోతున్నారు. భానుడి ప్రకోపానికి తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు విలవిలలాడుతున్నారు. రోహిణి కార్తె నేపథ్యంలో ఎండలు, వేడి గాలులు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. నెల్లూరు జిల్లా రాపూరులో 46 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో మొత్తం 35 ప్రాంతాల్లో 44 నుంచి 46 డిగ్రీల మ్ధ్య ఉష్ణోగ్రత్లు న్మోదయ్యాయని బుధవారం ఆర్టీజీఎస్ తెలిపింది. 50 ప్రాంతాల్లో 43 నుండి 44 డిగ్రీల మ్ధ్య ఉష్ణోగ్త్లు న్మోదైనట్లు పేర్కొంది.

ఏపీలో ఎక్కడెక్కడ ఎంతెంత ఉష్ణోగ్రతలు?

చిత్తూరు జిల్లా రేణిగుంట్లో 45.59 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత న్మోదు కాగా.. నెల్లూరు జిల్లా రాపూరులో అత్యధికంగా 46 డిగ్రీలు, బోగోల్‌లో 45.21, క్లిగిరిలో 44.61, చిల్లకూరులో 44.58, నాయుడుపేటలో 44.46 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చిత్తూరు జిల్లా వ్రాదయపాలెంలో 45.53, బుచ్చినాయుడికండ్రిగలో 44.59, ఏర్పేడులో 44.54, చంద్రగిరి 44.48, శ్రీకాళహ్ని 44.32, ప్రకాశం జిల్లా బ్లికుర్వలో 45.01, కురిచేడులో 44.54, వెంలిగండ్లలో 44.35,

గుంటూరు జిల్లా దాచేప్లిలో 45.43 డిగ్రీల సెంటీగ్రేడ్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తెలంగాణలో ఉష్ణోగ్రతలివీ..

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 44.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. జగిత్యాల 44.4, భైంసా 44.2, మెట్‌పల్లి 44.2, ఆదిలాబాద్ 44.1, సిద్దిపేట 43.9, ముస్తాబాద్ 43.9, నిర్మల్ 43.8, సంగారెడ్డి 43.8, సిరికొండ 43.8, రామగుండం 43.2, గంభీరావుపేట 43, మోర్తాడ్ 43, హైదరాబాద్ 41.8, రంగారెడ్డి 40.6, మేడ్చల్-మల్కాజ్‌గిరి 38.7 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## ఇందిరాగాంధీ పాత్రలో?



యష్ కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం కేజీఎఫ్ దేశవ్యాప్తంగా సంచలనాల్ని సృష్టించింది. కోలార్ గోల్డ్ మాఫియా నేపథ్యంలో రూపొందించిన పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ చిత్రానికి కేజీఎఫ్-2 పేరుతో రెండో భాగాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో 70వ దశకం నాటి సన్నివేశాల్లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా పనిచేసిన రోజుల్ని చూపించబోతున్నారు. ఈ సినిమాలోని కీలకమైన ఎపిసోడ్ నాటి ప్రధాని ఇందిరాగాంధీ చుట్టూ నడుస్తుందట. ఈ పాత్ర కోసం బాలీవుడ్ సీనియర్ నటి రవీనాటాండన్‌ను ఎంపిక చేస్తున్నారని తెలిసింది.

కథాగమనంలో ఇందిరాగాంధీ పాత్ర కీలకం కావడంతో రవీనాటాండన్ ఈ సినిమాకు ఓకే చెప్పిందని అంటున్నారు. ప్రశాంత్‌నీల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది.

## మూడు కాలాల కథ



జయప్రద, పూర్ణ, సాక్షిచౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం సువర్ణసుందరి. చరిత్ర భవిష్యత్తును వెంటాడుతుంది ఉపశీర్షిక. సూర్య ఎమ్.ఎస్.ఎన్ దర్శకుడు. ఎమ్.ఎల్.లక్ష్మి నిర్మాత. ఈ నెల 31న ప్రేక్షకులముందుకురానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ థ్రిల్లింగ్ అంశాలు మేళవించిన చిత్రమిది. సువర్ణసుందరి కథాకమామిషు ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. మూడు కాలాల కథ ఇది. గతంలో చేసిన తప్పు భవిష్యత్తును ఎలా వెంటాడుతుందన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. 45నిమిషాల పాటు సాగే గ్రాఫిక్స్ ప్రధానాకర్షణగా ఉంటాయి అన్నారు. ట్రైలర్‌కు మంచి స్పందన లభించిందని, తెలుగు..కన్నడ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రమిదని, తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుందని హీరో ఇంద్ర తెలిపారు. గ్లామర్, లవ్, యాక్షన్ అంశాలతో ఆకట్టుకునే చిత్రమిదని కథానాయిక సాక్షి చౌదరి చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# చిత్రభాను

# జ్యోతిక డైలాగ్‌ను దొంగిలించాను!

**స్టార్ ఇమేజ్, కమర్షియల్ సూత్రాలకు కట్టుబడిపోకుండా నటుడిగా ప్రతి సినిమా ద్వారా తనను తాను విభిన్న పంథాలో ఆవిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు హీరో సూర్య. ఆ శైలినే ఆయనకు తమిళంలో పాటు తెలుగులోఅంతులేని అభిమానుల్ని సంపాదించి పెట్టింది. అగ్ర నటుడిగా పేరుప్రఖ్యాతుల్ని తీసుకొచ్చింది. ప్రయోగాలకు ఎప్పుడూ పెద్దపీట వేసే సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ఎన్‌జీకే. సెల్వరాఘవన్ దర్శకుడు. ఈ నెల 31న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సూర్య చెప్పిన ముచ్చట్లివి...**

చాలా రోజుల తర్వాత రాజకీయ నేపథ్య సినిమా చేయడానికి కారణమేమిటి?

-రాజకీయ నేపథ్యాలతో ఇదివరకు శంకర్‌తో పాటు పలువురు దర్శకులు ఎన్నో విలక్షణమైన సినిమాలు చేశారు. రాజకీయ నాయకుల బయోపిక్‌లు వచ్చాయి. ఆ సినిమాలకు ఎన్‌జీకే పూర్తి విభిన్నంగా ఉంటుంది. రాజకీయ ఇతివృత్తాల్లోని కొత్త అంశాన్ని స్పృశిస్తూ సెల్వరాఘవన్ ఈ సినిమాను తెరకెక్కించారు. జ్యోతిక నటించిన ఓ సినిమాలోని డైలాగ్‌ను ఇందులో దొంగిలించాను. చెడు జరిగినప్పుడు చూస్తూ ఊరుకుంటే అందులో మనమూ భాగమైనట్లేనని అనే డైలాగ్‌తో ఈ కథాంశం ముడిపడి ఉంటుంది.

ఈ కథ వ్యక్తిగతంగా మీకు ఎంతవరకు కనెక్ట్ అయ్యింది?

-నాకే కాదు ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. సైంటిఫిక్ సినిమా కాదిది. ఇందులో ఎలాంటి పొలిటికల్ స్టేట్‌మెంట్స్ ఉండవు. పొలిటికల్ నేపథ్యంలేని ఓ సాధారణ యువకుడికి రాజకీయ చదరంగంలో ఎలాంటి ఎత్తుపల్లాలు ఎదురయ్యాయన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. రాజకీయ సమరంలో అతడు తన లక్ష్యాన్ని ఎలా చేరుకున్నాడన్నదానిని ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యేలా దర్శకుడు సెల్వరాఘవన్ చూపించారు.



యథార్థ సంఘటనలతో రూపొందించిన సినిమా అనుకోవచ్చా?

-వాస్తవికత, సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ రూపొందించిన సినిమా ఇది. సెల్వరాఘవన్ శైలి భావోద్వేగాలన్నీ ఇందులో ఉంటాయి. డైలాగ్స్, పతాక ఘట్టాలు అలరిస్తాయి. గత సినిమాల్లో మంచికోసం, నైతిక విలువల పక్షాన నిలబడే పాత్రల్లో నటించాను.ఈ సినిమాలో పూర్తి విభిన్నంగా నా పాత్ర సాగుతుంది.

సెల్వరాఘవన్‌తో సినిమా చేయడానికి చాలా కాలంగా ఎదురుచూస్తున్నానని ప్రీరిలీజ్ వేడుకలో చెప్పారు?

-2001 నుంచి సెల్వరాఘవన్‌తో సినిమా చేయాలని ఎదురుచూస్తున్నాను. 19 ఏళ్ల కల ఈ సినిమాతో నెరవేరింది. సెల్వరాఘవన్‌కు నేను అభిమానిని. ఆయన దర్శకత్వంలో నటించాలనే బలమైన కోరికతో చేసిన సినిమా ఇది. సెల్వరాఘవన్‌తో సినిమా అంటే ఆశ్రమానికి వెళ్లినట్లుగా ఉంటుంది. సెల్‌ఫోన్స్ అనుమతించరు. నటులంతా ధ్యానంలో ఉన్నట్లుగా కనిపిస్తారు.

సెల్వరాఘవన్ కొన్నాళ్లుగా పరాజయాల్లోనే ఉన్నారు. ఆయనతో సినిమా రిస్క్ అనుకున్నారా?

-కొందరు యూనిక్ పర్సన్స్‌కు ప్రత్యామ్నాయాలు ఉండవు. ఇండస్ట్రీలో సెల్వరాఘవన్ ఎప్పటికీ ఒక్కరే ఉంటారు. ప్రతి ఒక్కరి జీవితంలో దుర్దశ ఉంటుంది. దాని ఆధారంగా ప్రతిభను తక్కువ చేయలేం. సెల్వరాఘవన్‌లా సినిమాలు తీసే మరో దర్శకుడు ఎప్పటికీ రాలేరు.

ఈ సినిమా కోసం ఏ రాజకీయ నాయకుడినైనా అనుకరించారా?

-ఏ రాజకీయ పార్టీని, నాయకుడిని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన సినిమా కాదిది. ఎవరినిఅనుకరించే ప్రయత్నం చేయలేదు. రాజకీయాల్లోని సాధ్యాసాధ్యాల్ని చర్చించాం. కొన్ని సన్నివేశాలు కనెక్ట్ అవుతాయని అనుకుంటున్నాను. అంతేకానీ ప్రత్యేకంగా ఒకరిని స్ఫూర్తిగా తీసుకొని సినిమా చేయలేదు.

యాత్ర సీక్వెల్‌లో మీరు జగన్ పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి?

-కథ, మంచి టీమ్ కుదిరితే తప్పకుండా జగన్ పాత్రలో నటించడానికి సిద్ధంగా ఉన్నాను.



జగన్‌ను నేను అన్న అని పిలుస్తా. ప్రజాభిమానంతో ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టబోతుండటం చాలా ఆనందంగా ఉంది. ప్రజలు కోరుకునే మార్పు ఆయన ద్వారా సాధ్యమవుతుందని ఆశిస్తున్నాను.

కథానాయకుడిగా బిజీగా ఉంటూనే మరోవైపు నిర్మాతగా వరుసగా సినిమాలు చేస్తున్నారు?

-నా తల్లిదండ్రులు నాకు శరవణన్ అని పేరుపెట్టారు. కానీ సూర్యగా అభిమానుల హృదయాల్లో నిలిచిపోయాను. సూర్య అనే పేరు బ్రాండ్‌గా మారిపోయింది. బ్రాండ్ ఇమేజ్, స్టార్‌డమ్ వల్ల కొన్ని కథలు నచ్చినా చేయలేకపోతున్నాను. అలాంటి కథల్ని నిర్మించాలనే 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌ను స్థాపించాను.వినూత్న కథాంశాలతో కూడిన చిన్న సినిమాల్ని నిర్మిస్తున్నాను.

జ్యోతికతో మళ్లీ కలిసి నటించే అవకాశం ఉందా?

-మంచి కథ కుదిరితే తప్పకుండా కలిసి నటిస్తాం. మా కోసం ఒక దర్శకుడు కథ సిద్ధంచేసి ప్రథమార్థం చెప్పారు. కానీ ద్వితీయార్థం ఇంకా చెప్పలేదు.

ఏయిర్ ఇండియా కెప్టెన్ గోపీనాథ్ జీవిత కథలో నటిస్తున్నారు కదా..?

-పూర్తి బయోపిక్‌లా కాకుండా కథాపరంగా కొంత స్వేచ్ఛ తీసుకొని ఈ సినిమా చేస్తున్నాం. డాక్యుమెంటరీలా కాకుండా పూర్తి కమర్షియల్ హంగులతో వినూత్నంగా ఉంటుంది. సుధా కొంగర చాలా పరిశోధన చేసి ఈ కథను తెరకెక్కిస్తున్నది. నా కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమా అవుతుందని అనుకుంటున్నాను. అలాగే శివ దర్శకత్వంలో మరో సినిమా చేయబోతున్నాను.

తెలుగులో త్రివిక్రమ్ దర్శకత్వంలోఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది?

-చాలా మందితో చర్చలు జరుగుతున్నాయి. మంచి కథ వస్తే తప్పకుండా తెలుగులో సినిమా చేస్తాను.

## వేడుకగా ముగిసిన
# హనుమజ్జయంతి ఉత్సవాలు

### కన్నులపండువగా శ్రీ సీతారామ కళ్యాణం



విశాఖ సిటీ : ఎన్‌హెచ్-5 దరి సూర్యానగర్‌లో వేంచేసియున్న శ్రీ యోగసిద్ధాంజనేయస్వామి వారి ఆలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు ఈ మూడవ రోజు శ్రీ సీతారామకళ్యాణంతో ముగిశాయి. ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు ఆలయ కమిటీ సారథ్యంలో శ్రీ పాంచరాత్ర ఆగమ సాంప్ర దాయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను శోభాయమానంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ యోగ సిద్ధాంజ నేయ స్వామి వారు సంపూర్ణ రజిత కవచ ధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళధ్వని, వేదమంత్రపఠనం, శ్రీరామ నామ స్మరణతో సుప్రభాత సేవ, అర్చన, విశేష హోమములు, పూర్ణాహుతిని నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీ పాంచరాత్ర ఆగమ సాంప్రదా యంలో, సాంప్రదాయ రీతిలో లోక కళ్యాణార్థం విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిషేక మూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీ సీతారామ కళ్యాణం శ్రీరామనవమిని తలంపు చేసింది. సంపూర్ణ రజిత కవచధారిగా దర్శనమిచ్చిన శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణము అంతా శ్రీరామనామ స్మరణతో మారుమ్రోగింది. వందలాది సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఆధ్యాత్మిక అనుభూతికి లోనయ్యారు. విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ జరిగింది. మూడు వేలమందికిపైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తదుపరి శ్రీ యోగ సిద్ధాంజనేయస్వామి వారికి సింధూరంతో సహస్ర నామార్చన జరిపి భజనానంద హారతి నిర్వహించి వేద ఆశీర్వచనం చేశారు. వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు, పరిసరప్రాంత వాసులు, ఇతర ప్రాంతాలనుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఆంజనేయ ఆరాధనతో మనో ధైర్యం, స్థైర్యం సిద్ధిస్తాయి

- సకల దోషాలు తొలగి శుభాలు కలుగుతాయి
- శనిప్రభావం, ఈతిబాధలు తొలగిపోతాయి
- శ్రీ శారదాపీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి



విశాఖపట్నంః జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి దివ్య ఆశీస్సులతో బుధవారం శ్రీ హనుమాన్ జయంతి సందర్భముగా పీఠప్రాంగణంలో గల 18 అడుగుల ఏక శిలా దాసాంజనేయ స్వామి వారికి విశేష పంచామృత అభిషేకం జరిగింది.

ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహబాషణ చేస్తూ శ్రీ ఆంజనేయ స్వామిని ఆరాధించడం వలన మనోస్థైర్యం మనోధైర్యం కలుగుతాయని, ఏలినాటి శని ప్రభావం బాధలు తొలగిపోతాయని తెలియజేసారు. మన్యుసూక్తం, శ్రీ సూక్తంతో స్వామి వారికి లక్ష తమలపాకులతో విశేష అర్చన గావించారు. అనంతరం సింధూరార్చన గావించారు. సుందరాకాండ పారాయణం సాయంత్రం హనుమాన చాలీసా చేశారు. అనేక మంది పుర ప్రముఖులు స్థానిక ప్రముఖులు, ఇరు రాష్ట్రాలనుండి వచ్చిన అనేక మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తరపీఠాధిపతి బాలస్వామి పర్యవేక్షణలో నిర్వహించబడినది.

## ఆంజనేయుని పూజిస్తే సకల దోషాలు నివారణ అవుతాయి



సబ్బవరంః హనుమజ్జయంతి సందర్భంగా స్వామి వారిని పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన అదీప్‌రాజ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ ఆంజనేయుని పూజిస్తే సకల దోషాలు నివారణ అవుతాయని అన్నారు.



ఆంజనేయుడు భక్తికి, జ్ఞానానికి, ధైర్య సాహసాలకు ప్రతీకగా తలంచి నేటికీ ఆందరూ పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా పూజలో పాల్గొన్న అదీప్‌రాజ్ దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. పూజలలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ గావించారు.

# సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

### - జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సృజన



విశాఖపట్నం : వచ్చే నెల 2 న జరుగనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను జిల్లాలో పటిష్టంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సృజన పరీక్ష నిర్వాహకులను, అధికారులను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో అసి స్టెంట్ కో-ఆర్డినేటింగ్ సూపర్ వైజర్లు, వెన్యూ సూపర్ వైజర్లు, పోలీస్, విద్యుత్ , ఆర్ .టి.సి., పోస్టల్ అధికారులతో ఆమె సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 2 న జరుగనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు జిల్లాలో 22 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 112 అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. జూన్ 2 వ తేదీ ఆదివారం ఉదయం 9.30 నుండి 11.30 గంటల వరకు ఒక పరీక్ష, మద్యాహ్నం 2.30 నుండి 4.30 గంటల వరకూ మరొక పరీక్ష జరుగున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉపాద్యక్షులు మరియు మేనేజింగ్ డైరెక్టర్ కాంతిలాల్ దండే మరియు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి సోల్మన్ ఆరోఖ్య రాజ్ ను పరీక్షల పరిశీలకులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి పరీక్షా కేంద్రాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ పరీక్షల పేపర్లను తీసుకెళ్లే బాధ్యతను, కేంద్రాల తనిఖీ బాధ్యతను సహాయ కో-ఆర్డినేటింగ్ సూపర్ వైజర్లు వహించాలని ఆమె ఆదేశించారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పరీక్షా కేంద్రాల్లో పరీక్షల ముందురోజు సాయంత్రానికే పూర్తి చేయాలని వెన్యూల సూపర్ వైజర్లను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో గదులు, ఇతర వివరాలు స్పష్టంగా అభ్యర్థులకు తెలిపే విధంగా మ్యాప్లు, చార్టుల ద్వారా సూచించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎటు వంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, పారిశుద్యం, మరుగుదొడ్ల నిర్వహణను మెరుగుపర్చాలని జి.వి.ఎం.సి. అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించేందుకు ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పారామెడికల్ సిబ్బందిని నియమించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. పరీక్ష పేపర్లను ట్ ద్వారా స్పీడ్ పోస్టులో డిల్లీకి పంపే ఏర్పాట్లను చేయాలని పోస్టల్ అధికారులను ఆదేశించారు. జూన్ 2 న రైల్వే స్టేషన్, బస్టాండ్ , ద్వారకా నగర్ ల నుండి పరీక్షా కేంద్రాలకు ఉదయం 7.00 నుండి 10.00 గంటల మధ్య, మధ్యాహ్నం 12.00 నుండి 3.00 గంటల మధ్య ఆర్ .టి.సి. బస్సులు విరివిగా నడపాలని ఆర్.టి.సి. అధికారులను ఆమె ఆదేశించారు.

అసి స్టెంట్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్ వైజర్లు, ఇన్ స్పెక్టింగ్ ఆఫీసర్లు, ఆర్ .టి.సి., పోస్టల్, పోలీస్ అధికారులతో పాటు పరీక్ష కేంద్రాల ప్రిన్సిపల్స్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



వైఎస్సార్ జిల్లా కడపలోని పెద్ద దర్గాను సందర్శించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి. జగన్‌కు దర్గా మతపెద్దలు సాంప్రదాయరీతిలో తలపాగా చుట్టారు. అనంతరం చాదర్ సమర్పించారు.



దర్గా ప్రార్థన అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల వెళ్లి అక్కడి సీఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మతపెద్దలు దైవాశీస్సులు అందించారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com